Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 61 పేజీలు 8 వెల : 5 శుక్రవారం 22 ఆగష్టు 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.




## ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు జగన్ నిర్ణయం

**దీనిపై రెండో ఆలోచన లేదు: బొత్స**

రాజమండ్రి:ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మద్దతు ప్రకటించారు.. ఈ విషయమై రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. కీలక వ్యాఖ్యలు చేశారు.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ స్టాండ్ పై క్లారిటీ ఇచ్చారు.. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నెంబర్ గేమ్ ఉండకూడదనేది వైసీపీ విధానమని స్పష్టం చేశారు బొత్స.. పార్టీ ఆవిర్భావం నుంచి ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నాం.. గతంలో కాంగ్రెస్ హయాంలో రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీకి జగన్ మద్దతు ఇచ్చారు.. ఇప్పుడు అదే విధంతో ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తాం అని స్పష్టం చేశారు.. అయితే, తెలుగు అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన అభ్యర్థన పరిగణలోకి తీసుకునేది కాదని కొట్టిపారేశారు. ఉపరాష్ట్రపతిగా ఎన్డీఏ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని భావించిన బీజేపీ.. ఎన్డీఏ కూటమితో పాటు–.. ఇతర పార్టీల నేతలతోనూ సంప్రదింపులు జరిపింది.. అయితే, ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించడంతో.. ఎన్నికలు అనివార్యం అయ్యాయి.. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి కూడా దక్షిణాదికి చెందినవారు కదా? అని ప్రశ్నించారు వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్.. వైఎస్ జగన్‌కు ఫోన్ చేసి ఈ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని కోరారు. ఇండియా కూటమి తన అభ్యర్థిని బరిలోకి దింపాలని నిర్ణయించడంతో పోటీ– అనివార్యమైందని తెలిపారు. ఎన్డీఏ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను రంగంలోకి దింపుతున్నామని.. ఆయన్ను బలపరచాలని వైఎస్ జగన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జగన్.. పార్టీలో మాట్లాడుకుని నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.





## నాలా సవరణ నిధులు ఇక పంచాయితీలకే

**పవన్ సూచనకు సిఎం చంద్రబాబు ఆమోదం**

అమరావతి: ఏపీ మంత్రివర్గ భేటీలో నాలా చట్టసవరణపై డిప్యూటీ– సీఎం పవన్‌కల్యాణ్ కీలక సూచన చేశారు. సాగుభూమిని వ్యవసాయేతరంగా మార్చేటపుడు లభించే ఆదాయం పంచాయతీలకు అందేలా చూడాలని సూచించారు. తద్వారా పంచాయతీలు బలోపేతం అవుతాయన్నారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు.. మంచి సూచన చేశారని పవన్‌కు కితాబిచ్చారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా

**బీహార్ సర్ వ్యవహారంతో చర్చలకు మంగళం**
**విపక్షాల తీరుపై స్పీకర్ ఓం బిర్లా అసహనం**

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. నెలరోజుల ఈ సమావేశాలు ఆరంభం నుంచి కీలకమైన చర్చలకు వీల్లేకుండా, అత్యంత కీలకమైన ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండా ముగిశాయి. సెషన్ జులై 21న ఆరంభం అయింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సంబంధిత ఓటర్ల జాబితా సవరణల (సర్) అంశం ఆది నుంచి అంతం వరకూ వివాదాస్పదం అయింది. ఈ సర్ పక్రియ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లచోరీ జరిగిందని, దీనిపై ముందుగా చర్చ జరగాల్సిందే నని కాంగ్రెస్ సారథ్యంలో ఆప్ మినహా ఇతర పార్టీలు ఒక్కటిగా నిలిచి పట్టుపట్టాయి. అయితే ఎన్నికల సంఘం వ్యవస్థాగత అంశం. పైగా దీనిపై విచారణ ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ప్రస్తావన కుదరదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఉభయ సభలు దాదాపుగా ప్రతి రోజు వాయిదా పడుతూ వచ్చాయి. సభ్యుల నినాదాలు, పరస్పర ఆరోపణల నడుమ చివరికి వాకౌట్ల మధ్యనే ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో 12 బిల్లులకు ఆమోదం దక్కింది. అత్యంత కీలమైన బిల్లులు కూడా ఆమోదం పొందాయి. దేశంలో ఆన్‌లైన్ గేమ్స్, సంబంధిత యాప్స్‌పై నిషేధ బిల్లు , సముద్ర జలాల రవాణా సంబంధిత బిల్లు ఆమోదం పొందాయి. రెండు సభలలోనూ సర్ ఎటు–వంటి చర్చకు వీలులేకుండా అజెండాలకు అడ్డం పడింది. గురువారం చివరి రోజున ఉదయం 11 గంటలకు ముందుగా లోక్‌సభ ఓ సారి సర్ అంశంపైనే వాయిదా పడింది. తరువాత 12 గంటకు కూడా ఇదే పరిస్థితి సాగింది. మధ్యాహ్నం తరువాత స్పీకర్ ఓం బిర్లా లాంఛనపూర్వకంగా ఈ సెషన్ ముగింపు ప్రసంగం చేసి తరువాత సభ నిరవధిక వాయిదా విషయాన్ని ప్రకటించారు.



మెగా డీఎస్సీ మెరిట్ జాబితాపై కీలక అప్‌డేట్.. అభ్యర్థులకు సూచనలివిగో!



2వ

## లిక్కర్ కేసులో కీలక పరిణామం

**రాజ్ కసిరెడ్డి ఆస్తులు సీజ్**



అమరావతి: లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి చెందిన మరిన్ని విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ కేసులో కెసిరెడ్డి సహా పలువురు నిందితులు, పలు సంస్థలకు చెందిన రూ.62 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోల ద్వారా ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. తాజాగా.. మరో రూ.13 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతులు జారీ చేసింది. వైకాపా హయాంలో అక్రమ మద్యం అమ్మకాలతో వచ్చిన ముడుపుల ద్వారా పలు చోట్ల తన కుటు–ంబ సభ్యులు, బంధువుల పేరిట రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కొనుగోలు చేసినట్టు– సీఐడీ విచారణలో తేలింది. వీటిని సీజ్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరడంతో అనుమతి మంజూరు చేసింది. అక్రమ మద్యం వ్యాపారం నుంచి సంపాదించిన మొత్తం రాజ్ కెసిరెడ్డి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెరపల్లె, మాచన్ పల్లి గ్రామాల పరిధిలోని పలు సర్వే నెంబర్లలో రూ.కోట్ల విలువ చేసే 27.06 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు– డాక్యుమెంట్లతో సహా సీఐడీ ఆధారాలు సేకరించింది. వివిధ ప్రాంతాల్లో కూడబెట్టిన ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 13 కోట్లు– కాగా.. మార్కెట్ విలువ ప్రకారం రూ.వంద కోట్ల పైనే ఉంటుందని సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. ఆస్తుల సీజ్‌కు ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో కెసిరెడ్డి రాజశేఖరెడ్డి ఆస్తులు అటాచ్‌మెంట్ చేయాలని కోరుతూ విజయవాడలోని స్పెషల్ ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి ముందు సిట్ అధికారులు పిటిషన్ వేయనున్నారు. కోర్టు తగిన విచారణ జరిపిన అనంతరం ఆస్తుల అటాచ్ మెంట్‌కు ఆదేశాలు జారీ చేసే అవకాశాలున్నాయి.

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు



**మొత్తం 33 అజెండా అంశాలకు ఆమోదం**
**రాజధాని పరిధి 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో అభివృద్ధి**
**పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపు**
**డిప్యూటేషన్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 2,778 పోస్టుల భర్తీ**
**మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం'గా మార్పు**
**వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ...నాలా చట్టానికి ఆమోదం**
**కేబినేట్ వివరాలు వెల్లడించిన యంత్రి పార్థసారథి**

**అమరావతి:** మంత్రివర్గ సమావేశంలో మొత్తం 33 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. 51వ సీఆర్‌డీఏ సమావేశం ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాజధాని పరిధి 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు పచ్చజెండా ఊపింది. ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లికింగ్ పాలసీ (4.0) 2025–30కి ఆమోదం తెలిపింది. చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపు మార్గదర్శకాలకు ఆమోద ముద్ర వేసింది. సీఆర్‌డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యూటేషన్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 2,778 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అధికార భాషా సంఘం పేరును 'మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం'గా మార్పునకు ఆమోదం తెలిపింది.జలవనరులశాఖ పనులకు సంబంధించి మరో 11 అంశాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మంత్రివర్గం.. ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీకి ఆమోదం తెలపగా.. సాగుభూమిని వ్యవసాయేతరంగా మార్పునకు నాలా చట్ట సవరణలకు ఆమోదం తెలిపింది కేబినెట్.. 51వ సీఆర్డీఏ సమావేశం ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. సీఆర్డీఏ పరిధిలో సంస్థలకు భూకేటాయింపునకు ఆమోదం లభించగా.. మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సులకు కేబినెట్ ఆమోదం తెలిపింది..కేబినెట్ నిర్ణయాలను మీడియాకు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ.. 4.0 ప్రతిపాదనకు కేబినెట ఆమోదం తెలిపింది అన్నారు.. వేస్ట్ మేనేజ్మెంట్ కు సంబంధించి.. చెత్త నుంచి సంపద సృష్టికి సంబంధించిన పాలసీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు.. పర్యావరణాన్ని కాపాడుకునే ఉద్దేశంతో వ్యర్థాలని రిసైక్లింగ్ కి వాడుకునే విధంగా చెత్త నుంచి సంపదని సృష్టించే విధంగా మంత్రివర్గం అమోదించిడం జరిగిందని.. దీని ద్వారా పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు ఉపయోగపడ నుందని వెల్లడించారు.. టూరిజం అభివృద్ధిలో భాగంగా భూ కేటాయింపులకి కేబినేట్ ఆమోదం తెలిపిందని.. వీటి ద్వారా యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. ఇక, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల కోసం మార్పు చేసే నాలా చట్టాన్ని రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. భూ మార్పిడి ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆ ప్రాంత అభివృద్ధి కి వినియోగించాలి... గుంటూరులోని మున్సిపల్ భూమిని టిడిపి పార్టీ కార్యాలయానికి 33 సంవత్సరాలు లీజుకు ఇవ్వడానికి, ఎకరానికి 1000 రూపాయల చొప్పున దీన్ని 99 సంవత్సరాలు పాటు– పొడిగించుకునే వెసులుబాటు– కల్పిస్తూ మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు.. 44 ప్యాకేజీ ప్రకారం అమరావతిలో పనులనే బిడ్డర్ల కు ఇవ్వటం కోసం ఆమోదం లభించింది.. అమరావతి రాజధాని చుట్టూ ఉన్న 25 గ్రామాల పరిధిలో రాజధాని తో సమానంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం ఆమోదం తెలిపారు.

# కాళేశ్వరంపై వాడీవేడిగా వాదనలు



హైదరాబాద్:మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలంగాణ హై కోర్టులో గురువారం విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. ఐదు అంశాలను ప్రేయర్‌గా పేర్కొన్నారు పిటిషనర్లు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక రద్దు చేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. కమిషన్ నియమిస్తూ గత ఏడాది జీఓను కొట్టేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. తమకు కమిషన్ నివేదికను ఇవ్వలేదని కేసీఆర్, హరీష్‌రావు పేర్కొన్నారు. కమిషన్ విచారణ సమయంలో యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని పిటిషన్‌లో సుందరం తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పిటిషన్‌లో వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్‌ని ప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోదని పిటిషనర్ తరుపు న్యాయ వాది తెలిపారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ గోష్ కమిషన్ కమిషన్ నియామకం జరిగిందని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని వివరించారు. దురదృష్టవశాత్తు వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్ ఒక పిల్లర్ కుంగిందని.. వర్షాకాలంలో అకాల వర్షాలు కారణంగా కూలిందని తెలిపారు. కుంగిపోవడానికి డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరుపు న్యాయ వాది స్పష్టం చేశారు. నివేదిక కాపీలను తమకు అందజేయకుండా మీడియాకు అందజేయడంలో దురుద్దేశం ఉందని చెప్పుకొచ్చారు. సాధారణ ప్రజల్లో తమ పరువును అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని న్యాయవాది సుందరం తెలిపారు. నోటీసులో సరైన విధానంలో ఇవ్వలేదని వాదించారు. నివేదికను కూడా కేసీఆర్, హరీశ్ రావుకు అందించలేదన్న న్యాయవాది సుందరం వెల్లడించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని సుందరం తెలిపారు. రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని అన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. పిటిషనర్లు కేసీఆర్, హరీష్‌రావు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఏజీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయట పెట్టారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి జర్నలిస్టుకు 60 పేజీల నివేదిక అందజేశారని సుందరం తెలిపారు. కోర్టుకి సమర్పించిన కాపీలు సరిగ్గా కనిపించడం లేదని హైకోర్టు అభిప్రాయ పడింది. నివేదిక కాపీలు సరిగ్గా కనిపించేలా ఇస్తే తర్వాత విచారణ చేస్తామని తెలిపింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఈరోజే విచారణ కొనసాగించాలని కేసీఆర్ తరుపు న్యాయవాది సుందరం కోరారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా అని ఏజీని హైకోర్టు మూడు ప్రశ్నలు వేసింది. నివేదిక కాపీను పబ్లిక్ డొమైన్ లో పెట్టారా..? పిటిషనర్లకు 8కింద నోటీసులు ఇచ్చారా లేదా..? కమిషన్ నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి..? అని హై కోర్టు ప్రశ్నించింది. తాము ఇచ్చిన నోటీస్ 8బీ నోటీస్ అని న్యాయస్థానానికి ఏజీ తెలిపారు. సెక్షన్ మెన్షన్ చేయనంత మాత్రానా అది 8 బి నోటీస్ కాదని కాదంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. కిరణ్‌భేడీ కేస్‌కి ఈ కేస్‌కు తేడాలు ఉన్నాయని ఏజీ తెలిపారు. రిపోర్టును తాము ఎక్కడ పబ్లిక్ డొమెన్లో పెట్టలేదని ఏజీ క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీలో చర్చించాకే పబ్లిక్ డొమైన్‌లో పెడతామని స్పష్టం చేశారు. కౌంటర్‌లో మరిన్ని వివరాలు పొందపరుస్తామని వివరించారు. ఈ స్టేజిలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని హైకోర్టును ఏజీ కోరారు. అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించాక తదుపరి విచారణ చేపట్టాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద కాకుండా ఏ సెక్షన్ కింద నోటీసులిచ్చారా అని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కమిషన్ నివేదిక ప్రస్తుతం ఏ దశలో ఉందని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజాధనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కమిషన్‌ను ప్రభుత్వం వేసిందని ఏజీ తెలిపారు. కమిషన్ నివేదికను కేబినేట్ సులభంగా అర్థం చేసుకునేలా 60పేజీల నివేదిక రూపొందించారని ఏజీ తెలిపారు. 60పేజీల నివేదిక ఆధారంగా ఘోష్ కమిషన్ నివేదికను కేబినేట్ ఆమోదించిందని ఏజీ వెల్లడించారు. అసెంబ్లీలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేలా కేబినేట్ నిర్ణయం తీసుకుందని ఏజీ వివరించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టవద్దని ఏజీ సూచించారు. ఈ పిటీషన్లపై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద నోటీసులివ్వలేదని పిటీషనర్లు తప్పుపట్టడం చెల్లదని ఏజీ పేర్కొన్నారు. అయితే ఈ విచారణ రేపటికి హై హైకోర్టు వాయిదా వేసింది. ఏజీకి మరోసారి హైకోర్టు ప్రశ్నించింది. కమిషన్ నివేదికను ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు??? అని అడిగింది. ఈ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో పెడతారా??? అని ప్రశ్నించింది. అసెంబ్లీలో పెట్టాక నివేదికపై చర్యలు తీసుకుంటారా?? అని నిలదీసింది. రేపు లేదా సోమవారం సమాచారం తెలుసుకుంటానని ఏజీ తెలిపారు.

## తనపై మరిన్ని కుట్రలు చేస్తున్నారు



హైదరాబాద్:సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీ-బీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారని కవిత తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న కవిత ఈ మేరకు సింగరేణి బొగ్గు గని కార్మికులకు బహిరంగ లేఖ రాశారు. టీ-బీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకంట్ల కవితను ఆ పదవి నుంచి సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలగించారు. ఆమె స్థానంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్‌ను కేటీ-ఆర్ నియమించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో అన్నాచెల్లెళ్ల మధ్య పోరు మరింత తీవ్రంగా మారినట్లు- అయింది. అయితే కల్వకుంట్ల కవిత ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులకు గురువారం ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. టీ-బీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు- మీకు సేవ చేసుకునే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పదేళ్ల కాలంలో టీ-బీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ప్రతి కార్మిక కుటుంబంలో ఒక సోదరిగా మీకు సేవలందించాను. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ ఆఫీస్‌లో ఈ ఎన్నిక నిర్వహించడం సాంకేతికంగా తప్పా ఒప్పా అనే అంశాలను పక్కన పెడితే రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా తెలుస్తోన్నది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తాను పోరాడుతుంటే కొందరు తనపై కుట్రలు పన్నుతున్నారు. అలాంటి కుట్రలతో వ్యక్తిగతంగా తనకు వచ్చే నష్టం ఏమీ లేకపోయినా, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న తనను తొలగించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కొందరి లక్ష్యంగా

కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే పద్ధతిని పక్కన పెడితే గౌరవ కేసీఆర్ గారిని ఒప్పించి తిరిగి డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించేలా చేశాను. పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగంపై వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను తాను లేఖ రూపంలో తెలియజేశాను. తన తండ్రిగారైన కేసీఆర్ కి తాను గతంలోనూ ఇలాంటివి ఎన్నో లేఖలు రాశాను. తాను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు కేసీఆర్ గారికి రాసిన ఆ లేఖను లీక్ చేశారు. ఆ లేఖను లీక్ చేసి తనపై కుట్రలకు పాల్పడుతున్న వారు ఎవరో బయట పెట్టాలని తాను కోరాను. పార్టీలో జరుగుతోన్న వ్యవహారాలను తాను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా తనపై కక్షగట్టారు. ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా ఎళ్లవేళలా నేను మీ వెన్నంటే ఉంటానని మాట ఇస్తున్నానని కవిత తన లేఖలో పేర్కొన్నారు.

## మేట్టూరుకు జలకళ



చెన్నై: డెల్టా జిల్లాలకు సాగుజలాలను, ప్రజలకు తాగునీటిని అందించే మేట్టూరు జలాశయం ఈ యేడాదిలో ఐదోసారి పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆ జలాశయం 16 క్రష్ట్‌గేట్లను తెరచి జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా కర్ణాటకలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో ఆ డ్యాంల నుంచి విడుదలయ్యే అదనపు జలాలు మేట్టూరు జలాశయంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ డ్యాం నుంచి డెల్టా జిల్లాలకు సాగుజలాలను జూన్ 12న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేశారు. ఆ సమయంలో డ్యాంలో ముప్పావుశాతం మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఆ తర్వాత జూన్ 29న తొలిసారిగా పూర్తి స్థాయిలో (120 అడుగులు) జలాలతో నిండింది. అటు పిమ్మట జూలై 5న రెండోసారి, జూలై 25న నాలుగోసారి పూర్తిస్థాయిలో నీటిమట్టం నమోదైంది. ఆ తర్వాత రెండువారాలపాటు నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం భారీగా వర్షాలు కురవడంతో పాటూ కర్ణాటకలోని జలాశయాలలో నీటిమట్టం విపరీతంగా పెరిగింది. దీంతో ఆ డ్యాంల నుంచి భారీ పరిమాణంలో అదనపు జలాలను విడుదల చేయడంతో మేట్టూరు డ్యాంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వచ్చింది. మంగళవారం ఈ డ్యాంలో నీటిమట్టం 117.45 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 120 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలోకి 1,08,529 క్యూసెక్కుల జలాలు ప్రవేశిస్తున్నాయి. డ్యాం నుంచి 90 వేల

క్యూసెక్కులను చొప్పున జలాలను దిగువకు వదులుతున్నారు. మేట్టూరు డ్యాం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కావేరి నదిలో ఎవరూ స్నానం చేయకూడదని అధికారులు ఆంక్షలు విధించారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

నల్లగొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిలో భాగంగానే ఇప్పుడు యూరియా కష్టాలు అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారని అన్నారు. నల్లగొండలోని బీఆరెస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉంది. కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్లమని గుర్తు చేశారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేది రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం. గతంలో ధాన్యం కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. యూరియా కొరత వెనక కొంతమంది మంత్రులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోను కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారు. గతంలో మేము వస్తే అన్ని తెస్తామన్నారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం ఎరువులు తేలేవా? అని ప్రశ్నించారు. పోలీసులతో పహారా, లాఠీఛార్జ్ లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకుని పదవులు తెచ్చుకునే కాంగ్రెస్ నేతలకు..రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఇద్దరూ మంత్రులు ఉండి కూడా జిల్లాపై కనీసం రివ్యూ చేయలేదన్నారు. మంత్రుల తీరుతో నల్లగొండ జిల్లా ప్రతి రంగంలో తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో సాగు నీళ్ల కోసం రైతులు రోడ్డు ఎక్కుతుంటే మంత్రులు సిగ్గు పడాలన్నారు. మంత్రికి చేత కాక అధికారులతో తప్పుడు పద్ధతుల్లో ప్రకటనలు చేయిస్తున్నారు. కొరత లేదని తప్పుడు ప్రకటనలు చేసే అధికారులు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. మంత్రుల బాధ్యతను మీరు నెత్తిన వేసుకుని ఇబ్బందులు పడొద్దని సూచించారు. అధికారుల ప్రకటన నిజం అయితే రైతులు ఇవ్వాళ కూడా ఎందుకు క్యూ లైన్ల లో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతులు ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే లు గదారి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, యూరియా విషయంలో కావాలనే బీఆర్ఎస్, బీజేపీ విష ప్రచారం చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా సరఫరాపై బీజేపీ అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పలుకుబడి ఉంటే కేంద్రం నుంచి యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. అయితే ఆయనకు అంత పలుకుబడి ఉందని తాను అనుకోవడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉన్నదని తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం యూరియాను దిగుమతి చేసుకోలేకపోతున్నదని వెల్లడించారు. యూరియాను దాచుకుని తాము ఏం చేసుకుంటామని ప్రశ్నించారు. పదేపదే రాంచందర్ రావు విమర్శలు సరికాదన్నారు. బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. యూరియాపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డితో వ్యక్తిగతంగా మాట్లాడాలన్నారు. కేంద్రాన్ని ఒప్పించి రాంచందర్‌రావు యూరియా తెప్పించాలని కోరారు. యూరియా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తున్నామన్నారు. కేంద్రం కూడా సహకరించాలని కోరారు. రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలని చెప్పారు. అత్యవసరాన్ని గుర్తించి యూరియాను త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరియాను కనీసం చూడని నేతలు కూడా విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. పెద్దపెద్ద మాటలు మాట్లాడి అభాసుపాలుకావొద్దని సూచించారు. తనను విమర్శించే వారు కేంద్రమంత్రి నడ్డాను అడగవచ్చని చెప్పారు. యూరియా సరఫరాపై అన్ని లెక్కలు ఇస్తున్నానని వెల్లడించారు. రాంచందర్‌రావు అంటే తనకు గౌరవం ఉందని, అబద్ధాలు చెప్పి బీజేపీని బాగుచేయాలంటే సాధ్యం కాదన్నారు. రైతులపై రాజకీయాలు చేసి పార్టీని పెంచుకోలేరని వెల్లడించారు. రాంచందర్‌రావు వాస్తవాలు ఒప్పుకోవాలని హితవుపలికారు.

## ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై కీలక నిర్ణయం

### అకౌంట్స్, ప్రమాణాల పరిశీలనకు ఆదేశం

హైదరాబాద్: ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు- ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్టు- ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాలపైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధరించనున్నట్టు- ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.


## మేడారంలో 40కోట్లతో స్మృతివనం

### మంత్రులు సీతక్క, లక్ష్మణ్ వెల్లడి

హైదరాబాద్: మేడారం గ్రామంలో దాదాపు రూ. 40 కోట్ల వ్యయంతో 29 ఎకరాల విస్తీర్ణంలో సమ్మక్క, సారలమ్మ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు- రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు తెలియ చేశారు. గురువారం సచివాలయంలో వారు మాట్లాడుతూ, వచ్చే జనవరి 28 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు గతంలో మరెప్పుడూ లేనివిధంగా రూ.150 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈసారి జాతరకు ముందస్తుగా నిధులు మంజూరు చేయడం వల్ల సకాలంలో జాతర పనులు పూర్తవుతాయని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ల వివిధ చరిత్ర వారి పోరాటాలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మేడారం గ్రామంలో 29 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు- మంత్రి ధనసరి అనసూయ వెల్లడించారు. 13 వ శతాబ్దం నాటికి చెందిన మేడారం తల్లుల చరిత్ర, గిరిజన సంస్కృతిని తెలియ చేసే విధంగా ఈ స్మృతి వనం ఉంటు-ందని వివరించారు. మేడారంలో జంపన్న వాగు నుండి మేడారం గద్దెల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు ను విస్తరించి డివైడర్లు ఏర్పాటు- చేస్తున్నట్టు- చెప్పారు. దీనితో పాటు- అమ్మవార్ల గద్దెల చుట్టూ విస్తరణ, అభివృద్ధి పనులను ఆదివాసీ పూజారులతో చర్చించి చేపట్టనున్నట్టు- తెలిపారు. గత జాతర ఏర్పాట్లకు రూ.110 కోట్లు- కేటాయించగా ఈసారి జరిగే జాతరకు రూ.150 కోట్లు- కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ లు ధన్యవాదాలు తెలియ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పర్యాటకశాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తామన్నారు. స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆదివాసీ పూజారులతో కలిసి స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, డిప్యూటీ- సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలుగు ప్రజల గొప్ప జాతర సమ్మక్క సారలమ్మ జాతర. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం రూ.150 కోట్లు- మంజూరు చేసిందని సీతక్క తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,200 కోట్ల వ్యయంతో లక్షా 15 వేల 089 పనులను చేపడుతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. దీనిలో 1630 అంగన్వాడీ భవనాలు, 3157 గ్రామపంచాయితీ భవనాలు, ఇంకుడు గుంతలు, టాయిలెట్లు- తదితర నిర్మాణాలను చేపడుతున్నట్టు- వివరించారు. ఈ పనులను ఆయా నియోజక వర్గాల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారని మంత్రి వివరించారు.

## ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించే యత్నం

### రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై జైశంకర్



న్యూఢిల్లీ:ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా ఆయా చర్యలు తీసుకోవాలని కొన్నేళ్లుగా అమెరికా చెబుతోంది. మేం అగ్రరాజ్యం నుంచి కూడా చమురు కొనుగోలు చేస్తున్నాం. ఆ పరిమాణం కూడా పెరిగిందని జైశంకర్ తెలిపారు.ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న జైశంకర్.. ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఫస్ట్ డిప్యూటీ- ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ తదితరులతో భేటీ- అయ్యారు. భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇరుదేశాలు నూతన మార్గాలు అన్వేషించి ముందుకుసాగాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారత్‌లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించిన ఆయన.. తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తృత పరచుకోవాలని పిలుపునిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని అమెరికా ఒత్తిడి తెస్తున్న వేళ ఈ కీలక పర్యటన చేపట్టిన జైశంకర్.. ఇరుదేశాలు సృజనాత్మకంగా ముందుకు సాగాలన్నారు.రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రష్యా నుంచి చమురు కొనుగోళ్ల వ్యవహారంలో అగ్రరాజ్యం చేస్తున్న వాదనలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా అన్ని చర్యలు తీసుకోవాలని అమెరికా కొన్నేళ్లుగా చెబుతున్నట్లు- గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో అగ్రరాజ్యం వాదనల వెనుక ఉన్న లాజిక్ విషయంలో గందరగోళంగా ఉన్నట్లు- చెప్పారు.రష్యా చమురును భారీగా కొనుగోలు చేస్తున్న దేశం భారత్ కాదు. చైనా ఆ పని చేస్తోంది. అదేవిధంగా ఎల్ఎన్‌జీని కూడా మేం ఎక్కువగా కొనుగోలు చేయడం లేదు. ఐరోపా సమాఖ్య పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. 2022 తర్వాత రష్యాతో అత్యధిక వాణిజ్య వృద్ధి నమోదైన దేశం కూడా భారత్ కాదు. కొన్ని దక్షిణ దేశాలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీ మెరిట్ జాబితాపై కీలక అప్‌డేట్..

### అభ్యర్థులకు సూచనలివిగో!

ఇంటర్నెట్ డెస్క్: ఏపీ మెగా డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు కీలక అప్‌డేట్ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా మెరిట్ జాబితా పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 22 నుంచి మెరిట్ లిస్ట్‌లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ మెరిట్ జాబితాను (%ap dsc merit list% 2025) &md,https://apdsc.apcfss.in%/ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి వెబ్‌సైట్‌లలోనూ ఉంచనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే సమాచారం పొందాలని సూచించారు. వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా 'జోన్ ఆఫ్ కన్సిడరేషన్'లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్ అందించనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందన్న ఆయన.. అర్హులైన అభ్యర్థులను పారదర్శకంగా నియమించడమే ప్రభుత్వం దృఢ సంకల్పమని స్పష్టం చేశారు.

## బీహార్ ఓట్ల తొలగింపు ఒక్కటే సమస్యా ?

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వానాకాలం సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. బీహార్ ఓట్ల గొడవతో విపక్షాలు సమస్యలపై చర్చకు పూనుకోలేదు. రాజకీయంగా లబ్ది పొందే క్రమంలో దీనిపై రగడ చేస్తూనే ఉన్నారు. ఇకపోతే రాజకీయ నాయకుల నేరచరిత్రకు సంబంధించిన బిల్లు బుధవారం పార్లమెంట్ ముందుకు వచ్చింది. పదవిలో ఉంటూ ఏదైనా నేరాల్లో ఇరుక్కుని జైలు పాలయితే ఎంతటి పదవిలో ఉన్నా, అది ఉద్వాసన జరిగేలా ఓ చట్టం తీసుకుని వచ్చారు. ఇది అందరికీ సంబంధించినదే. కానీ విపక్షాలు దీనిని కూడా తప్పు పట్టాయి. అంటే రాజకీయ నేతలు నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అన్నది అర్థంకావడం లేదు. చట్టం ఎవరికైనా ఒక్కటే. దీనిపై చర్చించడంలో విపక్షాలు విఫలం అయ్యాయి. బీహార్ ఒక్కటే దేశ సమస్య కాదు. అందుకే గత జూలై 21న సమావేశాలు ప్రారంభం కాగా ఇప్పడి వరకు పెద్దగా చర్చలు సాగలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. మూడోదఫాలో మరింత సమర్థంగా, మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించడంలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలపై చర్చ జరిపి ఉంటే బాగుండేది. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాల కు శ్రీకారం చుట్టాలి. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. కేవలం బీహార్‌పై వాయిదా తీర్మానం చర్చించాలన్న ధోరణిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మరచారు. అందువల్ల సమస్యలను గుర్తించి చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. దీనిపై గందరగోళం సృష్టించడం ద్వారా తాము విజయం సాధించామని భావిస్తున్నారు. అధికారం యావలో కాంగ్రెస్ ఇలాంటి చెత్త నిర్ణయాలు సాగిస్తోంది. బీహార్ వ్యవహారం బీహార్లో చర్చించాలి. అక్కడే తేల్చుకోవాలి. లేదా ప్రశ్న రూపంలో పార్లమెంటులో చర్చకు రావాలి. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యావశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖజానాపైనా భారీగా భారం

# భక్తి శ్రద్ధలతో వినాయక చవితిని బ్రహ్మాండంగా నిర్వహించుకుందాం.

**నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి.**

**నిర్దేశించిన మార్గాల్లోనే విగ్రహాలను తీసుకెళ్లాలి.**

**డి.జె.లు, సినిమా పాటలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు బంద్.**

**కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 21**

వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, వినాయక సాగర్ లో నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగరంలో వినాయక చవితి నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. వినాయక చవితి, నిమజ్జనంలో ఆయా విభాగాల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందరూ భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. నగరంలో విగ్రహాలు ఏర్పాటు చేసేవారికి అన్ని అనుమతులు పొందేందుకు సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేశామని, తద్వారా త్వరగా అనుమతులు పొందవచ్చునని అన్నారు. ఇక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల నుండి వినాయక సాగర్ కు వెళ్ళే మార్గాల రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఇబ్బంది లేకుండా పాండ్ లో నీరు నింపాలని, ర్యాంప్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అలాగే ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పరిసర ప్రాంతాలను ఏపటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు లేకుండా ఎక్కువ వెలుగులు వచ్చేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎస్పిడిసిఎల్ అధికారులకు సూచించారు. అరటి మాన్లు, మామిడి తోరణాలు, తదితర అలంకరణలు, డివైడర్లు ఏర్పాటు చేయాలని టిటిడి అధికారులకు సూచించారు. బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఫైర్, మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మండపాల వద్ద సినిమా పాటలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు లేకుండా చూడాలని అన్నారు. ఊరేగింపులో డీజే సౌండ్లు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. విగ్రహాలు తీసుకెళ్లే మార్గంలో చెట్లు, విద్యుత్ వైర్లు అడ్డం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు గతంలో జరిగిన నిమజ్జన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని అందరూ కలసి కట్టుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ నరసింహ ఆచారి, అర్బన్ డెవలప్మెంట్ బోర్డు మెంబర్ విజయకుమార్, ఏఎస్పీ మనోహర ఆచారి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఎస్పిడిసిఎల్ ఎస్.ఈ. సురేంద్ర నాయుడు, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, ఈ.ఈ.రవీంద్ర, డి.సి.పి.ఖాన్, డిఎస్పీ లు భక్తవత్సలం, రామకృష్ణ ఆచారి, తహసీల్దార్ సురేష్ బాబు, ఫైర్, ఆర్టీసీ, మత్స్య శాఖ, టూరిజం శాఖ, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపి, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ పంటలో ఇనుము దాతులోపం



ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల మరియు ఎర్రకోట గ్రామాల్లో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా ఇప్పుడు పంట పూత దశలో ఉంది. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ఈ వేరుశనగ పంటలో ఇనుము దాతులోపం గమనించడం జరిగింది.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు ఆగస్టు 21 గురువారం**

ఎమ్మిగనూరు పరిధిలో పడిమెట్ల గ్రామంలో ధాతులోపము వస్తే ఆకులన్నీ పశుపుపచ్చ రంగులోకి మారి కిరణజన్య క్రియ దెబ్బతింటుంది. ఈ ధాతు నివారణకు అన్నభేది లేదా ఫెర్రస్ సల్ఫేట్ ఐదు గ్రాములు ఒక లీటర్ నీటి కలుపుకొని 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. అలాగే పత్తి పంటలో పచ్చ దోమను పరిశీలించడం జరిగింది . ఈ దోమ నివారణకు హెర్క్యులెస్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా పిప్రోనిల్ వ 1.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి లేదా ప్రొఫినోఫాస్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటర్ ని కలుపుకొని సాయంత్రం వేళలో పిచికారి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు యస్ మహమ్మద్ ఖాద్రి ఎమ్మిగనూరు మండల వ్యవసాయ అధికారి ఎం శివశంకర్ అలాగే విస్తరణ అధికారులు నరసింహుడు, రసూల్ మరియు రైతులు పాల్గొన్నారు మదిరెపల్లి శివశంకర్ మండల వ్యవసాయ అధికారి యెమ్మిగనూరు మండలం.

## వాకాడు మండలం లోని స్వర్ణముఖి బ్యారేజ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఆగస్టు 21**

వాకాడు మండలం లోని స్వర్ణముఖి బ్యారేజ్ ను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ, ఈ ఈ బాబు తో కలిసి సందర్శించిన జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలోని గూడూరు నియోజకవర్గం లో గల స్వర్ణముఖి నది మీద ఉన్నటువంటి స్వర్ణముఖి డైవర్షన్ బ్యారేజ్ ను ఎస్.ఈ మరియు బ్యారేజ్ డీ.ఈ లు , గూడూరు సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించడం జరిగిందన్నారు. ఈ బ్యారేజ్ ను 2005 లో నిర్మించడం జరిగిందని సుమారు 20 సంవత్సరాల నుండి తీర ప్రాంతానికి దగ్గరగా ఉన్నందున చాలావరకు రోజువారి నిర్వహణ లోపించడంతో గత కొన్ని సంవత్సరాలుగా వరద ముంపు నిర్వహణ లేకపోవడం వల్ల అదే విధంగా ఇక్కడున్న వాతావరణ పరిస్థితుల వల్ల చాలా వరకు బ్యారేజ్ లో ఉన్నటువంటి ఇనుప పరికరాలు అన్ని కూడా త్రుప్పు పట్టడం వల్ల రెగ్యులర్ ఆయిల్, గ్రీసింగ్ చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు అయితే ఉన్నాయని అన్నారు. దీని కింద ఆయకట్టు సుమారుగా కోటా, వాకాడు మండలాలలో ఉన్నాయని వాకాడు మండలంలో 9500 ఎకరాలు, కోట మండలంలో 300 ఎకరాలు మొత్తంగా 10 వేల ఎకరాలు దీని కింద ఆయకట్టు ఉందని అన్నారు. 10 కాస్క్యాడింగ్ చెరువుల ద్వారా ఈ ఆయకట్టు కు నీటిని సప్లై చేస్తున్నామని అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు గంగ నీరు కూడా బ్యారేజ్ లోనికి వదిలి ఖరీఫ్ పంటకు కూడా వచ్చేల చేస్తూ తద్వారా ఈ ఆయకట్టు కింద ఉన్న రైతులందరికీ సారవంతమైన నేలలు ఉన్నందున కూడా రెండు పంటలు ఖరీఫ్, రబీ లు వచ్చే విధంగా చర్యలు తీసుకు వస్తున్నామన్నారు. ఈ బ్యారేజ్ మరమ్మతులకు 3 కోట్లు అవసరమని అన్నారు. సంవత్సరానికి 10 నుండి 12 లక్షలు నిర్వహణ కు ఖర్చవుతుందని దీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. మరమ్మత్తులకు అవసరమైన 3 కోట్లను ప్రభుత్వానికి నివేదించామని వచ్చే సంవత్సరంలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయకట్టు కింద 10 వేల ఎకరాలు ఉంది కనుక రైతులు ఆందోళన చెందకుండా ఆయకట్టును పరిరక్షించడానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఎస్.ఈ , రైతులు ఫ్లడ్ బ్యాంక్ కూడా చాల వరకు కోతలకు గురైందని తమ దృష్టికి తీసుకొచ్చారని ప్రభుత్వానికి నివేదించామని అన్నారు.

## అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్ట్ 21**



ఎన్నికల సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు వెంటనే అమలు చేయాలని, అంగన్వాడీల వేతనాలను పెంచాలని, ఎఫ్.ఆర్.ఎస్ యాప్ ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు మోహన్ తో కలిసి అంగన్వాడీ యూనియన్ నాయకులు,కార్యకర్తలు సి.బెళగల్ తహసిల్దార్ వెంకటలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుండి , రాష్ట్రంలో 2019 నుండి అంగన్వాడీల వేతనాలు పెంచలేదని, వేతనాలు పెంచాలని గత ప్రభుత్వ హాయంలో 42 రోజులపాటు అంగన్వాడీలు సమ్మె చేయడం జరిగిందని, అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ అంగన్వాడి కార్యకర్తల సమ్మెకు మద్దతు తెలిపి, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల వేతనాలు పెంచుతామని, రకరకాల యాప్లతో ఇబ్బంది పడుతున్న అంగన్వాడీలకు యాప్లను రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరన్నర కాలమైన అంగన్వాడీల వేతనాలు పెంచకపోగా, రకరకాల యాప్లతో అంగన్వాడీలను ఇబ్బంది పెడుతున్నారని, ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలని, అంగన్వాడి సెంటర్ నిర్వాహణకు ట్యాబులు ఇవ్వాలని, ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని అంగన్వాడీల అప్పగించరాదని, అర్హులైన అంగన్వాడి కార్యకర్తలకు ప్రమోషన్లు ఇవ్వాలని, అంగన్వాడి హెల్పర్లకు అంగన్వాడీ కార్యకర్తలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, పి.ఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం అంగన్వాడీలకు కల్పించాలని, అంగన్వాడీల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఉమా, కళావతి, అన్నామణి, మరియమ్మ, మేరీ, హుస్సేన్ బి, ఇంతియాజ్ బి, దస్తగిరమ్మ, మహేశ్వరి, శైలజ, రాధమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఓట్ల తొలగింపు ఒక్కటే సమస్యా ?

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వానాకాలం సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. బీహార్ ఓట్ల గొడవతో విపక్షాలు సమస్యలపై చర్చకు పూనుకోలేదు. రాజకీయంగా లబ్ది పొందే క్రమంలో దీనిపై రగడ చేస్తూనే ఉన్నారు. ఇకపోతే రాజకీయ నాయకుల నేరచరిత్రకు సంబంధించిన బిల్లు బుధవారం పార్లమెంట్ ముందుకు వచ్చింది. పదవిలో ఉంటూ ఏదైనా నేరాల్లో ఇరుక్కుని జైలు పాలయితే ఎంతటి పదవిలో ఉన్నా, అది ఉద్వాసన జరిగేలా ఓ చట్టం తీసుకుని వచ్చారు. ఇది అందరికీ సంబంధించినదే. కానీ విపక్షాలు దీనిని కూడా తప్పు పట్టాయి. అంటే రాజకీయ నేతలు నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అన్నది అర్థంకావడం లేదు. చట్టం ఎవరికైనా ఒక్కటే. దీనిపై చర్చించడంలో విపక్షాలు విఫలం అయ్యాయి. బీహార్ ఒక్కటే దేశ సమస్య కాదు. అందుకే గత జూలై 21న సమావేశాలు ప్రారంభం కాగా ఇప్పడి వరకు పెద్దగా చర్చలు సాగలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. మూడోదఫాలో మరింత సమర్థంగా, మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించడంలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలపై చర్చ జరిపి ఉంటే బాగుండేది. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. 370 ఆర్టికల్ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాల కు శ్రీకారం చుట్టాలి. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. కేవలం బీహార్పై వాయిదా తీర్మానం చర్చించాలన్న ధోరణిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మరచారు. అందువల్ల సమస్యలను గుర్తించి చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. దీనిపై గందరగోళం సృష్టించడం ద్వారా తాము విజయం సాధించామని భావిస్తున్నారు. అధికారం యావలో కాంగ్రెస్ ఇలాంటి చెత్త నిర్ణయాలు సాగిస్తోంది. బీహార్ వ్యవహారం బీహార్లో చర్చించాలి. అక్కడే తేల్చుకోవాలి. లేదా ప్రశ్న రూపంలో పార్లమెంటులో చర్చకు రావాలి. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలి.

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ఆగస్టు 21**



అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలోని చెరువు నీటిని ఎమ్మెల్యే దస్తగిరి తూము ద్వారా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణ దొడ్డి చెరువు ద్వారా 150 ఎకరాల ఆయకట్టు పొలాలకు నీరు అందుతుందని, ఈ చెరువు నీటి ద్వారా బ్రాహ్మణ దొడ్డి, జులకల్ గ్రామాల రైతులు లబ్ధి పొందుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన రైతు సంక్షేమానికి కట్టుబడిందని, అన్నదాత శ్రేయస్సు కోరి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి రైతుకు సంవత్సరానికి 20వేల రూపాయలను అందిస్తోందని, దానిలో భాగంగా మొదట విడత 7వేల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దేవుడి దయవల్ల ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిశాయని,ప్రతి రైతు పొలం

పచ్చగా ఉండాలని, వ్యవసాయానికి సంబంధించి ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధికి, రైతు సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్, పోలకల్ అమర్నాథ్, బ్రాహ్మణ దొడ్డి నీటి సంఘం అధ్యక్షులు వడ్డే పెద్ద లక్ష్మన్న, బాబు, జక్రియ భాష, పెద్ద సోమన్న, స్వామి, వలి, సి.బెళగల్ ఐటీడీపీ అధ్యక్షుడు నల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

**బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి**




: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని నినాదాలు చేస్తూ బేతంచర్ల పట్టణంలో సిఐటియు కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి షేభరాణి,నాగలక్ష్మి,లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతా మినిట్స్ కాఫీ ఇచ్చారు తప్ప వాటిని అమలు చేయలేదని గుర్తు చేశారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ మారుతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎల్లయ్య,మండల నాయకుడు రామాంజనేయులు,అంగన్వాడీ టీచర్స్ ఆయలు,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దరాజు స్వామిని దర్శించుకున్న డోన్ ఎమ్మెల్యే

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



బేతంచర్ల మండల పరిధిలోని గుటు పల్లె గ్రామంలో పెద్దరాజు స్వామి దర్గాను ఉరుసు ఉత్సవాల సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి,పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు,గురువారం దర్శించుకున్నారు. దర్గ నిర్వాహకులు గ్రామస్తులు ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉరుసు మహోత్సవం మత సామ్రాస్యానికి సాంప్రదాయ విలువలకు ప్రతీక అన్నారు. ఎమ్మెల్యేలకు దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి,ఆశీర్వదచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి



**బేతంచెర్ల :ఉత్తేజిత ప్రతినిధి :**

బేతంచర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహిళల సౌకర్యార్థం రూ 8 లక్షలతో నిర్మించిన వెట్ లెట్రిన్ ను సర్పంచ్ కోడి వెంకటేశ్వర్లు,ఎంపీటీసీ రామనాథం,వైసిపి నాయకులు జార్జి,వార్డు సభ్యులు స్వాములు, ఆదిలక్ష్మిలు ప్రారంభించారు. అనంతరం సర్పంచును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విషయం: మెగా డీఎస్సీ నియామకాలలో పారదర్శకత లేకపోవడం కూటమి ప్రభుత్వంపై అభ్యర్థుల ఆందోళనలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఆగస్టు 21 గురువారం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ మునిసిపల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామకాల ప్రక్రియలో అనేక లోపాలు, పారదర్శకత లోపం స్పష్టంగా బయటపడుతున్నాయని విమర్శించారు. సాధారణంగా డీఎస్సీ పరీక్షల అనంతరం మెరిట్ లిస్ట్, కేటగిరీ వారీ కటాఫ్ మార్కులు ప్రకటించడం సర్వసాధారణం. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వం ఇప్పటివరకు మెరిట్ లిస్ట్‌ను ప్రకటించకపోవడం, కటాఫ్ వివరాలు దాచిపెట్టడం వల్ల అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు. అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా తాము ఎక్కడ నిలిచారన్న స్పష్టత లేక కౌన్సిలింగ్‌కు సిద్ధం కావలేకపోతున్నారు. రోస్టర్, రిజర్వేషన్ల అమలుపై కూడా ప్రభుత్వం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పారదర్శకతా సూత్రాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రిజర్వేషన్లు, రోస్టర్ ప్రకారం కౌన్సిలింగ్ జరిగేదని, కానీ ఈసారి ఆ విధానం పూర్తిగా కనుమరుగైందని విమర్శించారు. అదే విధంగా, 60 వేలమంది అభ్యర్థులు టెట్ మార్కులు తప్పుగా నమోదు చేశామంటూ దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం చెప్పడం అసత్యం అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఇంకా టెట్ క్వాలిఫై కాని అభ్యర్థులకూ మార్కుల సవరణకు అవకాశం ఇవ్వడం నియామక ప్రక్రియలో విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చిందని అన్నారు.

ఈ సందర్భంలో మునిసిపల్ వైస్ చైర్మన్ %డ% నియోజకవర్గ యువజన విభాగఅధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ ప్రభుత్వం ముందు కొన్ని కీలకమైన డిమాండ్లు ఉంచారు. వెంటనే జిల్లా మరియు సబ్జెక్ట్ వారీగా మెరిట్ లిస్ట్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించాలని, కటాఫ్ మార్కులు పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేయాలని, అలాగే రోస్టర్, రిజర్వేషన్ వివరాలు స్పష్టంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియామక ప్రక్రియ ప్రతి దశ కూడా పబ్లిక్ డొమైన్‌లో ఉండాలని, లేకపోతే అభ్యర్థుల హక్కులను కాపాడటానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. డి. నజీర్ అహమ్మద్,
మునిసిపల్ వైస్ చైర్మన్,
నియోజకవర్గ యువజన విభాగఅధ్యక్షులు,
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఎమ్మిగనూరు.

## స్త్రీ శక్తి పథకం విజయోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు ఆగస్టు 21.**




గురువారం పట్టణంలోని ముందుగా శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తేరు బజార్‌లోని వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గార్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సమాజాభివృద్ధి కోసం కృషి చేసిన మహిళలను సత్కరించారు. అనంతరం మహిళలు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. స్త్రీశక్తితో పాటు మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతుండడం హర్షణీయమన్నారు.
బిలిఈ కార్యక్రమంలో మహిళలు, కూటమి పార్టీల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## డా.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు కై దళిత, బహుజనుల ఐక్యత ప్రదర్శన

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు ఆగస్టు 21 గురువారం**



తేది: 25-8-2025, సోమవారం
సమయం: ఉదయం 10:30 ని.లకు
స్థలం: %MRO% ఆఫీస్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకుప్రియమైన ప్రజలారా! భారతదేశంలో దళిత, బహుజనులకు భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గారు రెండు కళ్ళు లాంటివాళ్ళు. అలాంటి మహనీయులలో ఒకరైన డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహాన్ని గత 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అయితే స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గారి విగ్రహాన్ని నెలకొల్పాలని దళిత సంఘాలు జేఏసీగా ఏర్పడి 2012 లో విన్నవించగా అప్పటి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ డి.జంబులమ్మ ఎమ్మిగనూరు పట్టణంలో న్యూ మున్సిపల్ కార్యాలయం దగ్గర, రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా పార్క్ రోడ్డు డివైడర్ నందు విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం నెంబర్: 153/2012, తేది:05-10-2012 న ఆమోదించి రాజశ్రీ జిల్లా కలెక్టర్, కర్నూలు వారికి పంపడం జరిగింది. ఆమోదించి 13 సంవత్సరాలు గడిచినా విగ్రహం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

కావున పార్టీలకతీతంగా దళిత నాయకులు, దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు"దళిత,బహుజనుల ఐక్యతా ప్రదర్శన" కార్యక్రమంలో పాల్గొని మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేయుటకు తరలిరావాలని పిలుపునిస్తున్నాము. ఇట్లుసామాజిక ఉద్యమ నమస్కారములతో..!డా. బాబూ జగ్జీవన్ రావ్ విగ్రహ నిర్మాణ కమిటి, ఎమ్మిగనూరు. సెల్:9989386008.

## ఎమ్మిగనూరు నూతన డిఎస్పీని కలిసిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఆగస్టు 21 గురువారం టౌన్ అధ్యక్షులు మద్రి ఆదాము అలియాస్ గుంటెప్ప మాదిగ ఆధ్వర్యంలో నేడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం, ఎమ్మిగనూరు టౌన్ డీఎస్పీ ఆఫీస్ నందు ఇటీవల ఎమ్మిగనూరు నూతన డిఎస్పీగా విచ్చేసిన భార్గవి మేడమ్ గారిని మర్యాదపూర్వకంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛమిచ్చి, ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, పెద్దకడబూరు, మాధవరం, కౌతాళం, కోసిగి, ఎమ్మిగనూరు టౌన్ లలో ఆధిపత్య కులాలు దళిత గిరిజనుల పైన అంటరానితనం కులవివక్షత దాడులు హత్యలు మానభంగాలు ఆలయ ప్రవేశాలు జరగకుండా, రెండు గ్లాసుల పద్ధతులు నెమలు విప్పు పింఛంలాగ నాట్యం చేస్తున్నవి. బాధితులు పైన పేర్కొన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తే 72 గంటలైనా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు కట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తే జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘము పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తే అప్పుడు ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అవుతున్నాయి. ఎస్సీ ఎస్టీ కేసులను నమోదు అయినప్పటికీ డీఎస్పీ విచారణలో ముద్దాయిలకు మద్దతుగా ఉంటూ కేసులను ఫాల్స్ చేస్తున్నారు. ముద్దాయిలకు భయం లేకుండా పోతూ ఉన్నది. రాబోయే రోజుల్లో ఎమ్మిగనూరు డివిజన్లో ఏ ఒక్క దళిత గిరిజనుల పైన కుల వివక్షత జరిగితే బాధితుడు ఫిర్యాదు చేస్తే వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి ముద్దాయిలను రిమైండ్ కు తరలించి, శిక్షలు పడే విధంగా దోహదం చేయాలని మాట్లాడి, లికర్నూలు జిల్లాలోని ఏ ఒక్క దళిత గిరిజనలకు అన్యాయం జరిగిన మొట్టమొదటిసారిగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం ఖండించి బాధితులు, బాధిత కుటుంబాలకు అండగా నిలబడడం జరుగుతూ ఉన్నదని మాట్లాడితే అందుకుగాను డీఎస్పీ సానుకూలంగా స్పందించి ఇకమీదట ఎస్సీ ఎస్టీల పైన ఏ అన్యాయం జరిగిన నా దృష్టికి తీసుకోరండి వెంటనే ముద్దాయిలపైన కేసులు కడతామని తెలపడం జరిగిందని మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గంధాలము మణికుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు శావల బుజ్జిబాబు మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు పెద్ద ముష్టి అబ్రహం మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ మహిళా అధ్యక్షురాలు కదిరికోట పద్మక్క, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ ఇన్చార్జి కదిరికోట రాజు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు నాయకంటి ఆదాము మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్
నందవరం మండల నాయకులు శావల భాస్కర్ మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి

### తుగ్గలి,జొన్నగిరి,మద్దికేర ఎస్సైలు బాల నరసింహులు,మల్లికార్జున, విజయ్ కుమార్ నాయక్.

**తుగ్గలి/మద్దికేర: ఉత్తేజిత న్యూస్:**




తుగ్గలి, మద్దికేర మండలాల పరిధిలోని గల గ్రామాల్లోని ప్రజలందరూ వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని తుగ్గలి,జొన్నగిరి, మద్దికేర ఎస్సైలు బాల నరసింహులు, మల్లికార్జున,విజయ్ కుమార్ నాయక్ లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐలు వారి స్టేషన్ నందు మాట్లాడుతూ ఈ నెల 27వ తారీఖున వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాలలో వినాయక విగ్రహాలు పెట్టి మండపాలు ఏర్పాటు చేసేవారు ముందస్తుగా ఆంధ్రప్రదేశ్ పోలీసు వెబ్ సైట్ గణేష్ఉత్సవ్.నెట్ లో పూర్తి వివరాలు నమోదు చేసుకున్న తరువాత పోలీసు వారు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని వారు తెలియజేశారు. పోలీసులు అనుమతి ఇచ్చిన తరువాత విగ్రహ కమిటీ వారు ఆన్లైన్ నందు క్యూఆర్ కోడ్ ప్రింట్ తీసుకొని గణేష్ మండపాల దగ్గర కనపడేటట్లు లామినేషన్ చేసి ఉంచవలెనని,పోలీస్ వారు సందర్శించి ఆన్లైన్ నందు స్కాన్ చేసి ఫొటోస్ ఆన్లైన్ నందు పొందపరుస్తారని వారు తెలియజేశారు. ఈ వినాయక విగ్రహాలు ఏర్పాటుకు ఎటువంటి రుసుము అవసరం లేదని వారు తెలియజేశారు. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు ఈ నిబంధనలను తప్పకుండా పాటించాలని వారు తెలియజేశారు. వినాయక ఉత్సవాల నందు ఎటువంటి డీజే లకు అనుమతి లేదని,ప్రతి మండపం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వినాయక మండపాలు దగ్గర ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని,వినాయక మండపాలు రోడ్డుకు అడ్డంగా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఏర్పాటు చెయ్యరాదని,ప్రతి విగ్రహం దగ్గర రోజు 24ఐ7 ఎవరో ఒకరు బాధ్యత కలిగిన వ్యక్తి ఉండేలా కమిటీ సభ్యులు చూసుకోవాలని,పోలీస్ వారు,వినాయక కమిటీ వారు నిర్ణయించిన రూట్ నందు మాత్రమే ఊరేగింపుగా తీసుకొని వెళ్ళాలని ,నిమ్మజ్జనం జరుగు ప్రదేశలలో చిన్న పిల్లలు, మహిళలు మరియు వృద్దులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ,నిమజ్జనం రోజున మధ్యాహ్నం 1 గంటలకు విగ్రహాలను కదిలించి సాయంత్రం 6 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేయాలని,ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా విగ్రహ కమిటీ వారు జాగ్రత్తగా చూసుకోవాలని, మండపం వద్ద కానీ,ఊరేగింపు సమయంలో కానీ ఎవరైనా వ్యక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించిన,చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన అంటువంటి వారిపైన చట్ట పరమైన చర్యలు తీసుకోనుబడతాయని వారు తెలియజేశారు. వినాయక నిమజ్జనం రోజున ప్రజలు,కమిటీ నిర్వాహకులు అందరూ పోలీసులకు సహకరించి నిమజ్జనంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ప్రజలు జరుపుకోవాలని తుగ్గలి,జొన్నగిరి, మద్దికేర ఎస్సైలు బాల నరసింహులు,మల్లికార్జున,విజయ్ కుమార్ నాయక్ లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి,జొన్నగిరి,మద్దికేర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ నియామకాలలో పారదర్శకత లేకపోవడం కూటమి ప్రభుత్వంపై అభ్యర్థుల ఆందోళనలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు ఆగస్టు 21 గురువారం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ మునిసిపల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామకాల ప్రక్రియలో అనేక లోపాలు, పారదర్శకత లోపం స్పష్టంగా బయటపడుతున్నాయని విమర్శించారు. సాధారణంగా డీఎస్సీ పరీక్షల అనంతరం మెరిట్ లిస్ట్, కేటగిరీ వారీ కటాఫ్ మార్కులు ప్రకటించడం సర్వసాధారణం. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వం ఇప్పటివరకు మెరిట్ లిస్ట్‌ను ప్రకటించకపోవడం, కటాఫ్ వివరాలు దాచిపెట్టడం వల్ల అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు. అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా తాము ఎక్కడ నిలిచారన్న స్పష్టత లేక కౌన్సిలింగ్‌కు సిద్ధం కావలేకపోతున్నారు. రోస్టర్, రిజర్వేషన్ల అమలుపై కూడా ప్రభుత్వం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పారదర్శకతా సూత్రాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రిజర్వేషన్లు, రోస్టర్ ప్రకారం కౌన్సిలింగ్ జరిగేదని, కానీ ఈసారి ఆ విధానం పూర్తిగా కనుమరుగైందని విమర్శించారు. అదే విధంగా, 60 వేలమంది అభ్యర్థులు టెట్ మార్కులు తప్పుగా నమోదు చేశామంటూ దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం చెప్పడం అసత్యం అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఇంకా టెట్ క్వాలిఫై కాని అభ్యర్థులకూ మార్కుల సవరణకు అవకాశం ఇవ్వడం నియామక ప్రక్రియలో విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చిందని అన్నారు. ఈ సందర్భంలో మునిసిపల్ వైస్ చైర్మన్ %డ% నియోజకవర్గ యువజన విభాగఅధ్యక్షులు
డి. నజీర్ అహమ్మద్ ప్రభుత్వం ముందు కొన్ని కీలకమైన డిమాండ్లు ఉంచారు. వెంటనే జిల్లా మరియు సబ్జెక్ట్ వారీగా మెరిట్ లిస్ట్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించాలని, కటాఫ్ మార్కులు పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేయాలని, అలాగే రోస్టర్, రిజర్వేషన్ వివరాలు స్పష్టంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియామక ప్రక్రియ ప్రతి దశ కూడా పబ్లిక్ డొమైన్‌లో ఉండాలని, లేకపోతే అభ్యర్థుల హక్కులను కాపాడటానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. డి. నజీర్ అహమ్మద్,మునిసిపల్ వైస్ చైర్మన్,నియోజకవర్గ యువజన విభాగఅధ్యక్షులు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఎమ్మిగనూరు.

## అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 21 :**



కూటమి ప్రభుత్వం తక్కువ ధరకు పేదవాడి కడుపు నింపేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కీమ్ అన్న క్యాంటీన్అని నందికొట్కూర్ మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ అన్న క్యాంటీన్ అకస్మిక తనిఖీ చేసి అన్నారు. అన్న క్యాంటీన్ లో గురువారం ఉదయం బ్రేక్ ఫాస్ట్ ఆహార నాణ్యతను స్వయంగా తిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ రిజిస్టర్ తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. క్యాంటీన్ సిబ్బందికి జీతాలు సకాలంలో అందుతున్నాయా లేదా, వారికి ఏమైనా సమస్యలు అని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ కు అల్పాహారం కోసం వచ్చిన వారితో మాట్లాడి. ఆహారం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్న క్యాంటీన్ లో పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం లభించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## నేడు మండల స్థాయి ప్రజా పరిష్కార ఫిర్యాదుల వేదిక

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ఆగస్టు 21**



సి.బెళగల్ మండల కేంద్రం నందు కర్నూల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు,కర్నూలు జాయింట్ కలెక్టర్, కర్నూలు రెవెన్యూ విభాగపు అధికారి సమక్షంలో శుక్రవారం మండల స్థాయి ప్రజా పరిష్కార ఫిర్యాదుల వేదిక నిర్వహించబడునని తహసిల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టాదారు పాసుబుక్కుల కొరకు, ఆన్లైన్ అడంగల్ లో పేర్లు నమోదు కొరకు, జాయింట్ ఎల్పియం సమస్యలు, రేషన్ కార్డుల సమస్యలు మరియు ఇతర భూ సమస్యల కొరకు రైతులు,ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించబడునని తహసిల్దార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అమరావతి ఎస్వీ ఆలయంలో పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 21**

అమరావతి (వేంకటపాలెం) శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం రాత్రి పూర్ణాహుతితో ఘనంగా ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదేవి,

భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, రుత్వికులకు బహుమానం, పవిత్రోత్సవాలతో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీ మల్లికార్జున, టెంపుల్ ఇన్స్పెక్టర్లు శ్రీ రామకృష్ణ, శ్రీ సందీప్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# బొగ్గు గని నుంచి బంగారు గని వైపు..

తెలంగాణ: బొగ్గు ఉత్పత్తిలో అపార అనుభవం కలిగిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఖనిజ అన్వేషణలో మరో మెట్టు ఎక్కింది. కర్ణాటకలోని దేవదుర్గ్ ప్రాంతంలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్‌ను దక్కించుకుంది. వేలంలో 37.75% రాయల్టీతో L-1 బిడ్డర్‌గా నిలిచినట్లు సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. ఇది సింగరేణికి శుభారంభమని, ఇతర రంగాల్లో విస్తరణకు తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

బొగ్గు ఉత్పత్తిలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఖనిజ అన్వేషణ రంగంలో కీలక విజయం సాధించింది. కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ్ ప్రాంతంలో ఉన్న బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్‌ను సింగరేణి సంస్థ దక్కించుకుంది. గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన వేలంలో 37.75% రాయల్టీ కోట్ చేసి L-1 బిడ్డర్‌గా నిలిచిందని సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. ఈ విజయం సింగరేణి సంస్థకు కీలక ఖనిజాల రంగంలో శుభారంభమని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన దిశలో ఇతర రంగాల వైపు విస్తరించేందుకు ఇది మొదటి అడుగు అని బలరామ్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ అన్వేషణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

దేవదుర్గ్ ప్రాంతంలోని బంగారం, రాగి గనిలో సింగరేణి త్వరలోనే అన్వేషణ కార్యకలాపాలు ప్రారంభించనుంది. అన్వేషణ అనంతరం, సంస్థ తుది నివేదికను కేంద్రానికి సమర్పిస్తుంది. దాని ఆధారంగా కేంద్రం ఆ గనులను మైనింగ్ కోసం వేలం వేస్తుంది. మైనింగ్ హక్కులు దక్కించుకున్న సంస్థలు, గని ఆపరేషన్ గడువు పూర్తయ్యే వరకు సింగరేణికి 37.75% రాయల్టీ చెల్లిస్తాయి. ఈ అన్వేషణకు సుమారు రూ.90 కోట్లు ఖర్చు అవుతుందని.. ఇందులో రూ.20 కోట్లు కేంద్రం సబ్సిడీగా అందిస్తుందని సింగరేణి తెలిపింది.

ఈ విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్య మంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. బొగ్గు రంగంలో 136 ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణి ఇప్పుడు కీలక ఖనిజాల అన్వేషణలో ముందంజ వేయడం గర్వించదగిన విషయమని అన్నారు. భారతదేశంలో అగ్రగామిగా భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎండీ బలరామ్ ఈ విజయాన్ని ఉద్యోగుల కృషికి అంకితం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం మార్చి 13న దేశవ్యాప్తంగా 13 ఖనిజ గనుల అన్వేషణ లైసెన్సుల కోసం వేలాన్ని ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి మూడు బ్లాక్లను ఎంచుకుని వాటిపై అధ్యయనం చేసి, వేలంలో పాల్గొంది. మధ్యప్రదేశ్‌లోని పదార్ ప్రాంతంలో ప్లాటినమ్ గ్రూప్ ఎలిమెంట్స్, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరి వద్ద రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, కర్ణాటకలోని దేవదుర్గ్ వద్ద బంగారం, రాగి గనులు. ఈ మూడు గనుల కోసం ఈ నెల 13, 14, 19 తేదీలలో ఆన్‌లైన్ వేలం జరిగింది. ఇందులో కర్ణాటకలోని దేవదుర్గ్ గనుల అన్వేషణ లైసెన్స్‌ను సింగరేణి దక్కించుకుంది.

# నేడూ వానలు..

తెలంగాణ: గత రెండు వారాలుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ శాఖ రాబోయే ఐదు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది, ముఖ్యంగా ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు రాష్ట్రానికి మరోసారి రెయిన్ అలర్ట్ జారీ చేశారు. దక్షిణ ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన వాయుగుండం కారణంగా రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులు భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఒడిశాలోని భవానీపట్నానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది రాబోయే 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

నేడు ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల ప్రజల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు



జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని.. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు తరలివెళ్లాలి. అవసరమైతే అధికారుల సహాయం తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు అనవసర ప్రయాణాలు మానుకోవాలని.. విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని.. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు. కాగా, హైదరాబాద్ నగరంలో మంగవారం జోరుగా వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి మ్నొదలైన వాన మంగళవారం ఉదయం వరకు కురిసింది. ఆ తర్వాతా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది.

# మద్యం షాపుల టెంటర్లకు దరఖాస్తుల ఆహ్వానం..

## ఈ సారి ఫీజు ఎంతో తెలుసా..



తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 10, 2027 వరకు లైసెన్స్ కాలం ఉంటుందని.. ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీ సామాజిక వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను కేటాయించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రకటించింది. 2025-2027 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్ శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలంగాణలోని 2,620 మద్యం షాపులకు లైసెన్స్ కొరకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ కొత్త లైసెన్సుల గడువు డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు ఉంటుంది. ఈసారి దరఖాస్తు రుసుమును రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు. దుకాణాల లైసెన్సులను వార్షిక ఎక్సైజ్ పన్ను ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించనున్నారు.

సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు, అర్హతలు..

ఈ మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చింది. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను రిజర్వ్ చేశారు. ఇలా మొత్తం 30 శాతం రిజర్వేషన్లకు కేటాయించారు. వీటితో పాటు.. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా.. ఒకే దరఖాస్తుదారుడు ఒక దుకాణానికి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించేందుకు అవాకాశం కల్పించారు.

మద్యం దుకాణాల లైసెన్సుల స్లాబ్‌లు..

మొత్తం ఆరు స్లాబులుగా ఈ లైసెన్సుల ఫీజులను నిర్ణయించారు. ఇది 2011 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించబడింది. ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ. 50 లక్షలుగా, 5,000 నుండి 50,000 మధ్య జనాభా ఉన్న చోట రూ. 55 లక్షలుగా, 50,000 నుంచి ఒక లక్ష వరకు ఉన్న ప్రాంతాలకు రూ. 60 లక్షలుగా, ఒక లక్ష నుంచి ఐదు లక్షల మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 65 లక్షలుగా నిర్ణయించారు. ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 85 లక్షలు, ఇక 20 లక్షల పైన జనాభా ఉన్న నగరాల్లో వార్షిక ఫీజు రూ. కోటి పది లక్షలుగా ఖరారు చేశారు.

లాటరీ ద్వారా దుకాణాలను పొందినవారు వార్షిక లైసెన్స్ రుసుమును ఆరు సమాన వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను, పావు వంతు (25 శాతం)కు సమానమైన బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతి ఉంది.

# వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి.

**- ఎమ్మెల్యే జయసూర్య కు వినతిపత్రం అందజేత.**



**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఆగస్టు 21:**

వికలాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయ మని నందికొట్కూరు దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు నాగన్న అన్నారు. వికలాంగుల పింఛన్లను పునరుద్ధ రించాలని గురువారం నందికొట్కూరు మండలం అల్లూరు లో పింఛన్ కోల్పోయిన వికలాంగులతో కలిసి ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లకు అనర్హులని గ్రామ పంచాయతీ అధికారులు వికలాంగుల ఇండ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇవ్వడంతో వికలాంగులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుండి పింఛన్లు వస్తున్న వికలాంగులకు కూడా నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.ప్రతి ఒక్కరికీ గతంలో సదరం సర్టిఫికెట్లను డాక్టర్లు ఇచ్చారని వాటి ద్వారానే పింఛన్లు వస్తూ ఉన్న వాటిని తీసివేయడం రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ల తొలగింపు అన్యాయమన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో 471మంది పింఛన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నోటీసులు ఇచ్చిన వికలాంగులందరికీ పింఛన్లు తీసివేయకుండా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో వికలాంగులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని. హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వికలాంగులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చి సాఫ్ట్‌వేర్ జాబ్..

తెలంగాణ: ఇంటర్ విద్యార్థులకు ఐటీ రంగంలో అవకాశాలు కల్పిస్తూ హెచ్‌సీఎల్ టెక్ 'టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. శిక్షణ, ఇంటర్న్‌షిప్‌తో పాటు హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ఎంపికైన వారికి శిక్షణలో నెలకు రూ.10 వేల స్టైపెండ్‌తో పాటు, ఉద్యోగం వచ్చాక రూ.1.7 లక్షల నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనం ఉంటుంది. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించవచ్చునని హెచ్‌సీఎల్ టెక్ తెలిపింది.

ప్రస్తుతం నడుస్తున్నదంతా ఐటీ హవా. చాలా కంపెనీలు ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. అయితే సరైన నైపుణ్యాలు లేకపోవటంతో బీటెక్‌లు, ఎంటెక్‌లు పూర్తి చేసినా ఉద్యోగాలు లభించటం లేదు. ఎద్దైనా ఐటీ కంపెనీలో ఓపెన్స్ ఉన్నాయని తెలిస్తే.. వేల మంది నిరుద్యోగులు పోటీ పడుతున్నారు. అయినా కూడా కొందరికి ఉద్యోగాలు లభించటం లేదు. దీంతో చాలా మంది యువత నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. తెలంగాణలోని ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్‌తో సంబంధం లేకుండా నేరుగా ఐటీ రంగంలోకి ప్రవేశించే అవకాశం కల్పిస్తోంది. ఈ ప్రోగ్రామ్‌లో శిక్షణ, ఇంటర్న్‌షిప్‌తో పాటు, హెచ్‌సీఎల్‌లో పూర్తి స్థాయి ఉద్యోగం కూడా పొందవచ్చు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

ఈ ప్రోగ్రామ్‌లో చేరాలనుకునే అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అర్హత సాధించాలి. ఆ తర్వాత ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. అయితే ఈ ప్రోగ్రామ్ ఉచితం కాదు. నిర్దిష్ట ప్రోగ్రామ్‌ను బట్టి రూ. 51 వేల నుంచి రూ. 2.34 లక్షల వరకు ట్యూషన్ ఫీజు ఉంటుంది. ఐటీ సర్వీసెస్/ అసోసియేట్‌కు ఎంపికైనవారు బ్యాంకు నుంచి రుణ సౌకర్యం పొందవచ్చు. శిక్షణ అనంతరం సులభవాయిదాల్లో దీన్ని చెల్లించుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్ మొత్తం 12 నెలల పాటు ఉంటుంది. ఇందులో అభ్యర్థులకు టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలపై విస్తృత శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు నెలకు దాదాపు రూ.10 వేల వరకు స్టైపెండ్ లభిస్తుంది. ఇది వారి ఆర్థిక అవసరాలకు తోడ్పడుతుంది.

ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వారికి హెచ్‌సీఎల్‌లో ఐటీ సర్వీసెస్ అసోసియేట్ వంటి పోస్టులలో ఉద్యోగం లభిస్తుంది. ఈ ఉద్యోగంలో వార్షిక వేతనం రూ.1.7 లక్షల నుంచి రూ.2.2 లక్షల వరకు ఉంటుంది. మెడికల్, ఫ్యామిలీ ఇన్సూరెన్స్ మొదలైన ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

ఈ ప్రోగ్రామ్‌లో చేరిన విద్యార్థులు ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు కొనసాగించే అవకాశం ఉంది. బిట్స్ పిలానీ, ఎమిటీ యూనివర్సిటీ, శాస్త్ర యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేయవచ్చు.

హెచ్‌సీఎల్ టెక్ సీనియర్ వైస్-ప్రెసిడెంట్ సుబ్బరామన్ ఈ ప్రోగ్రామ్ యువతకు ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఇంటర్ తర్వాత ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశమని చెప్పారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు హెచ్‌సీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన ఇంటర్ స్టూడెంట్ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుబ్బరామన్ సూచించారు.

# శుభం కార్డుతో ఉత్సవాన్ని ముగించేద్దాం.. సీఐ





**వినాయక ఉత్సవాలలో గొడవలు వద్దు.. ఎస్పై**

**- సాయంత్రం 6 గంటలకు నిమజ్జనం పూర్తి చేయాలి**

**- వినాయక చవితికి పోలీసు నిబంధనలు పాటించాలి..**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి**

ఆగస్టు 21 - మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక ఉత్సవాన్ని శుభం కార్డుతో ముగించేద్దామని ఉత్సవ కమిటీ నాయకులకు నందికొట్కూరు రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని స్థానిక బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్ స్టేషన్ లో వివిధ గ్రామాల విగ్రహ ఉత్సవ కమిటీ నాయకులతో ఎస్ఐ తిరుపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన నిర్వహించబోయే వినాయక చవితి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే విగ్రహాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ఐదుగురికి పైగా వ్యక్తులు కమిటీగా ఏర్పడి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ప్రజలకు అంతరాయం లేకుండా ఉండాలన్నారు. రాత్రి వేళ పది దాటితే మైకులు ఆఫ్ చేయాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాల్లో గొడవలు ఉండకూడదని అంతేగాక పండుగ సందర్భంగా ఏ గ్రామంలో కూడా కుటుంబాలలో శ్లోకం మిగిల్చకూడదని తెలిపారు. నిమజ్జనం దగ్గరికి చిన్న పిల్లలు తీసుకురాకూడదని సూచించారు. నిమజ్జనం రోజున డీజే పెడితే కేసు కట్టి సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఐ మేరీ జయంతి, హెడ్ కానిస్టేబుళ్లు రమణ, వర కుమార్, పోలీస్ సిబ్బంది నూర్ అహ్మద్, రాజశేఖర్, నరసింహ, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో కొత్త ట్రంపెట్ జంక్షన్..



హైదరాబాద్: కోకాపేట నియోపొలిస్‌లో రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన ట్రంపెట్ జంక్షన్‌ను అందుబాటులోకి వచ్చింది. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జంక్షన్ ప్రారంభించనున్నారు. నియోపొలిస్, శంకర్‌పల్లి ప్రాంతాల ప్రజలకు ఔటర్ రింగ్ రోడ్డుకు నేరుగా చేరుకోవడానికి ఈ జంక్షన్ ఉపయోగపడుతుంది. దీని ద్వారా ప్రయాణ సమయం తగ్గి.. శంషాబాద్ విమానాశ్రయానికి 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.

హైదరాబాద్ కోకాపేట నియోపొలిస్ ప్రాంతంలో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ట్రంపెట్ జంక్షన్ అందుబాటులోకి వచ్చింది. రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ జంక్షన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించనున్నారు. ఈ కొత్త మార్గంతో నియోపొలిస్ నివాసితులు, అలాగే శంకర్‌పల్లి, మోకిల వంటి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నేరుగా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పైకి చేరుకోవచ్చు. ఇది వరకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన ఇబ్బంది ఈ జంక్షన్‌తో పూర్తిగా తొలగిపోయింది. ఈ జంక్షన్ వల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. నియోపొలిస్ నుంచి కేవలం 20 నిమిషాల్లోనే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునే వీలు ఏర్పడనుంది.

ఈ ప్రాంతంలో ఉన్న ఐటీ, ఇతర బహుళజాతి కంపెనీల ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుంది. ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రాకపోకలను సులభతరం చేస్తుంది. ఈ ట్రంపెట్ జంక్షన్‌లో నాలుగు వరుసలతో నిర్మించిన ప్రధాన రహదారి పొడవు 600 మీటర్లు. ఓఆర్ఆర్‌తో పాటు సర్వీస్ రోడ్లను కలుపుకుంటే దీని మొత్తం పొడవు 1.3 కిలోమీటర్లు. ఈ జంక్షన్‌ను ఉపయోగించుకోవాలంటే వాహనదారులు టోల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టోల్ గేట్ కూడా ఇప్పటికే ట్రంపెట్ మార్గంలో ఏర్పాటు చేశారు.

ట్రంపెట్ జంక్షన్ ప్రారంభంతో..

నియోపొలిస్‌లో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడం వంటి అంశాలలో ఈ ప్రాజెక్టు చాలా ఉపయోగపడుతుంది. ఇది కోకాపేట ప్రాంతం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టుగా నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్ నగరంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అంటున్నారు. దాదాపు 530 ఎకరాల్లో విస్తరించి ఉన్న నియోపొలిస్ లేఅవుట్‌ను హెచ్ఎండీఏ సుమారు రూ.450 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసింది. ఇందులో ఆధునిక మౌలిక వసతులైన విశాలమైన రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, తాగునీటి వ్యవస్థలు, పచ్చదనం వంటివి ఉన్నాయి. ఈ లేఅవుట్ బహుళ వినియోగ జోన్ లో ఉండటంతో ఇక్కడ నివాస, వాణిజ్య, వ్యాపార భవనాలు వేగంగా నిర్మిస్తున్నారు. నార్సింగి వద్ద రూ.15 కోట్లతో మరో ఇంటర్‌ఛేంజ్ కూడా నిర్మించడం ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడుతుంది.

# ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉండాలంటే...!

మన ఎముకలు మంచి చేవగా, దృఢంగా ఉంటేనే మన శరీరం కూడా బలంగా ఉంటుంది. ఎముకలు బలహీనమైతే పెళుసుగా మారిపోతే చిన్న చిన్న కుదుపులు, దెబ్బలకు కూడా చిటుక్కున విరిగిపోతుంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకలు పలు రకాల అనారోగ్యాలకు గురవుతూ.. బలహీనపడుతుంటాయి. మన ఎముకలను ఆరోగ్యంగా, దృడంగా ఉంచుకోవడానికి.. పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన ఎముకలకు తగినంత కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం చాలా ముఖ్యం. మన ఎముకలను స్ట్రాంగ్‌గా ఉంచే.. హెల్తీ.. టేస్టీ.. డ్రింక్స్ గురించి ఈ స్టోరీలో చూద్దాం.










పాలు... పాలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. వెన్న తొలగించిన పాలు తీసుకుంటే.. రోజూవారీ అవసరమైన 30 శాతం కాల్షియం శరీరానికి అందుతుంది. అంతేకాదు, పాలలో విటమిన్ డి అధికంగా ఉంటుంది. విటమిన్ కాల్షియంను సమర్థవంతంగా గ్రహిస్తుంది. మీరు ప్లాంట్ బేస్డ్ మిల్క్ కూడా తీసుకోవచ్చు. రోజూ ఒక గ్లాస్ పాలు తాగితే.. ఎముకలు దృఢంగా ఉంటాయి.


సోయా పాలు... పాలకు తగిన పోషకాల ప్రత్యామ్నాయం సోయాపాలు. ఎండిన సోయా బీన్స్‌ని నీళ్లల్లో నానబెట్టి ఈ పాలను తీయవచ్చు. లాక్టోజ్ పడనివాళ్లు కూడా దీన్ని ప్రయత్నించవచ్చు. సోయాపాలలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యాన్ని రక్షించడానికి సహాయపడతాయి. ఈ పాలను తాగితే రక్తనాళాలు బలపడతాయి. మెనోపాజ్ చిక్కులకు పరిష్కారం లభిస్తుంది. దీనిలో తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్‌లూ, చక్కెరా ఉంటాయి.

గ్రీన్ స్మూతీ... మెగ్నీషియం, జింక్ సైతం ఎముక పటుత్వానికి తోడ్పడతాయి. సమతులాహారం తీసుకోవటం ద్వారా ఇవన్నీ లభిస్తాయి. విటమిన్ కె కూడా ముఖ్యమే. ఇది ఎముక ఏర్పడటంలో, గట్టి పడటంలో పాలు పంచుకునే ప్రొటీన్లను ప్రేరేపితం చేస్తుంది. ఎముకలు గుల్ల బారినవారిలో విటమిన్ కె ఎముక సాంద్రత పెరిగేలా చేస్తున్నట్టు, ఎముక విరిగిపోయే ముప్పు తగ్గిస్తున్నట్టు అధ్యయ నాలు పేర్కొంటున్నాయి. పాలకూర, తోటకూర వంటి ఆకు కూరల్లో ఈ పోషకాలు ఉంటాయి. ఆకుకూరలతో గ్రీన్ స్మూతీ చేసుకుని తాగొచ్చు.

బ్రకోలీ జ్యూస్.. బ్రకోలీలో కాల్షియంతో పాటు.. ఎముకల ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు నిండి ఉంటాయి. సి, కె- విటమిన్లూ పీచూ సమృద్ధిగా ఉన్న బ్రకోలీ రోగనిరోధక శక్తిని పెంచడమే కాదు, ఎముకల సంరక్షణకీ తోడ్పడు తుంది. దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడుతుంది. బ్రకో లీ జ్యూస్ చేసుకుని తాగితే.. ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటా యి.

ఆరెంజ్ జ్యూస్.. ఆరెంజ్ జ్యూస్‌లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడానికే కాదు.. ఎముకల ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. ఎముక పోగు పడటానికి పునాది వేసే ప్రొటీన్ పోచలు ఏర్పడటానికి విటమిన్ సి అత్యవసరం. దీని స్థాయిలు ఎక్కువగా గలవారిలో ఎముక సాంద్రత అధికంగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. రోజూ ఒకగ్లాస్ ఆరెంజ్ జ్యూస్ తాగితే.. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. బోన్ బ్రోత్‌లో కాల్షియం, మెగ్నీషియంతో పూటు.. మినరల్స్ మెండుగా ఉంటాయి. కొల్లాజెన్ అధికంగా ఉండే ఈ డ్రింక్ ఎముకలకు అవసరమైన బిల్డింగ్ బ్లాక్‌లను అందించడమే కాకుండా, ఎముకల నిర్మాణానికి బలమైన మద్దతును కూడా అందిస్తుంది.

# కిచెన్ సింక్ స్మెల్ వస్తుందా..






కిచెన్ సరిగ్గా క్లీన్ చేయకపోతే చాలా స్మెల్ వస్తుంటుంది. ఇలాంటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అయితే కిచెన్ స్మెల్ రాకుండా ఉంటుంది. అవేంటో తెలుసుకోండి. కిచెన్ సింక్ నుంచి స్మెల్ వస్తుంటే అక్కడ ఉండలేం ఇబ్బందిగా ఉంటుంది. ఇదిలానే ఉంటే కీటకాలు, వైరస్ వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే ఎక్కువగా క్లీన్ చేయాలి. అందుకోసం కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

వెనిగర్.. స్టౌ దగ్గర కిచెన్ వస్తే వెనిగర్ యూజ్ చేస్తే సమస్య తగ్గుతుంది. ఓ కప్పు నీటిలో 3 కప్పుల వెనిగర్ వేసి కాస్తా బేకింగ్ సోడా, నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని పోసి సింక్ క్లీన్ చేయాలి. దీని వల్ల మరకలు, మురికి కూడా దూరమవుతుంది.

నాఫ్తలీన్ బాల్స్.. సింక్‌లోని వాసనని దూరం చేయడానికి ఈ బాల్స్ హెల్ప్ చేస్తాయి. వీటిని మనం బాత్‌రూమ్స్, అల్మారాల్లో పెడతారు. అయితే వీటిని సింక్‌లోపల కాకుండా కింద పైప్ దగ్గర పెట్టండి. దీని వల్ల వాసన దూరమవుతుంది.

నిమ్మ తొక్కలు.. నిమ్మతొక్కలని వాడడం వల్ల సింక్ క్లీన్ అవుతుంది. అందుకోసం నిమ్మరసం పిండి అందులో ఉప్పు వేసి సింక్ వేసి రుద్దండి. అలానే అరగంట ఉంచి తర్వాత క్లీన్ చేస్తే సింక్ క్లీన్ అవుతుంది. మంచి స్మెల్ వస్తుంది.

పెప్పర్‌మింట్ ఆయిల్.. కిచెన్ సింక్ నుండి స్మెల్‌ని దూరం చేసేందుకు పెప్పర్‌మింట్ ఆయిల్ హెల్ప్ చేస్తుంది. స్ప్రే బాటిల్‌లో కొద్దిగా నీరు పోసి అందులో 10 చుక్కల పిప్పరమెంట్ ఆయిల్ వేసి దీనిని స్ప్రే చేయాలి. దీని వల్ల స్మల్ దూరమవుతుంది.

సబ్బు, బేకింగ్ సోడా, రాక్ సాల్ట్.. సింక్ క్లీన్ చేయడానికి సాధారణంగా సబ్బు, బేకింగ్ సోడా, రాకింగ్ సాల్ట్‌తో క్లీన్ చేయొచ్చు. వీటిని కలిపి కిచెన్ సింక్‌ని క్లీన్ చేయొచ్చు. దీని వల్ల చాలా వరకూ సింక్ క్లీన్ అవుతుంది. స్మెల్ కూడా దూరమవుతుంది.

వేడి నీరు..అదే విధంగా వారానికి ఓ సారైనా వేడి నీరు పోయండి. దీని వల్ల జిడ్డు మరకలు, వ్యర్థాలు బయటకి వెళ్తాయి. దీంతో పాటు డ్రైనేజీ క్లీన్ చేస్తుండాలి. దీని వల్ల సింక్ ఎక్కువగా స్మెల్ రాదు.

# శీతాకాలం ఈ మాస్క్ అప్లై చేస్తే..



శీతాకాలంలో వాతావరణం ఎఫెక్ట్ జుట్టుపై ఎక్కువ పడుతుంది. ఈ సీజన్‌లో చలిగాలుల ప్రభావం, వాతావరణంలో ఉండే తేమ, పొగమంచు.. వంటి కారణాల వల్ల జుట్టు పొడిబారుతుంది, అట్టలా మారుతుంది, చిక్కులు కూడా ఎక్కువగా పడుతుంది. హెల్తీ హెయిర్ ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే.. డ్రై హెయిర్ ఉన్నవారి బాధలు చెప్పనవసరం లేదు. చలికాలంలో చల్లని గాలుల జుట్టులోని నూనె తీసివస్తాయి, జుట్టును డీహైడ్రేట్ చేస్తాయి. ఈ సీజన్‌లో మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మృదువుగా మార్చుకోవడానికి.. కొన్ని న్యాచురల్ హెయిర్ మాస్క్‌లు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

తేనె, పాలతో.. ఈ సీజన్‌లో డ్రై హెయిర్ సమస్యను దూరం చేయడానికి, చిక్కులు సమస్యను తగ్గించుకోవడానికి.. తేనె, పాల హెయిర్ మాస్క్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. తేనె జుట్టుకు తేమనందిస్తుంది. పాలలోని ప్రొటీన్లు, అమినో యాసిడ్స్ మీ జుట్టును లోతుగా హైడ్రేట్ చేస్తాయి. వాటిని మృదువుగా ఉంచుతాయి. జుట్టు చిక్కులు విడదీస్తాయి. మీ మాస్క్ వేసుకోవడానికి.. అరకప్పు పాలలో.. రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు మాస్క్‌లా అప్లై చేసుకోండి. దీన్ని 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ఘాడత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయండి. ఈ మాస్క్ వారానికి రెండుసార్లు వేస్తే.. జుట్టు హెల్తీగా, సిల్కీగా ఉంటుంది. హెయిర్ గ్రోత్‌ను కూడా ప్రోత్సహిస్తుంది.

అరటి పండు, కొబ్బరి నూనెతో.. అరటిపండ్లులోని విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం , సిలికాన్ వంటి పోషకాలు జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొబ్బరి నూనె జుట్టును హైడ్రేటింగ్‌గా ఉంచడంతో పాటు అనేక ప్రయోజనాలు అందిస్తుంది. ఈ మాస్క్ పొడిబారిన జుట్టును పట్టులా మారుస్తుంది, చిక్కులు పడకుండా చేస్తుంది. ఈ మాస్క్ తయారు చేసుకోవడానికి.. బాగా పండిన మెత్తటి అరటి పండులో.. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని జుట్టు మాస్క్‌లా అప్లై చేయండి. మీ జుట్టును షవర్ క్యాప్‌తో కవర్ చేసి.. 20 నుంచి 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.





అవకాడో, కొబ్బరి పాలతో.. అరకప్పు కొబ్బరిపాలలో మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల అవకాడో గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులకు అప్లై చేసి 20 నుంచి 30 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపూ ఉపయోగించి తలస్నానం చేసి, నాణ్యమైన కండిషనర్ అప్లై చేసుకోవాలి. ఈ ప్యాక్‌లో మనం ఉపయోగించే అవకాడో కురులకు తగినంత తేమ అందించి అవి ప్రకాశవంతంగా కనిపించేలా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

కలబంద, ఆలివ్ ఆయిల్ మాస్క్.. కలబంద.. జుట్టుకు పెట్టడం వల్ల జుట్టులో సహజసిద్ధమైన తేమ నిలిచి ఉంటుంది. కలబందను ఆలవ్ ఆయిల్‌తో మిక్స్ చేసి అప్లై చేస్తే... పొడిబారిన, చిట్లిన జుట్టును మృదువుగా ఆరోగ్యంగా మారుస్తుంది. రెండు టేబుల్ స్పూన్ల తాజా కలబంద గుజ్జులో మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ కలపండి. మాడుకు, జుట్టుకు ఈ మిశ్రమాన్ని అప్లై చేయండి. దీన్ని 30 నిమిషాల పాటు ఆరనిచ్చి.. గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయండి. ఈ మాస్క్ స్కాల్ప్‌ను శాంతపరచి, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.

# ఈ నూనెలతో మసాజ్ చేస్తే పొడిబారకుండా స్కిన్ మెరుస్తుంది..







చలికాలంలో ఈ నూనెలతో మసాజ్ చేస్తే పొడిబారకుండా స్కిన్ మెరుస్తుంది.. చలికాలంలో స్కిన్ కేర్ అనేది చాలా ముఖ్యం. ఎందుకంటే చల్లి వాతావరణంలో రంధ్రాలు బిగుతుగా ఉంటాయి. కాబట్టి, చర్మం ఎక్కువగా మురికి లేకుండా, తాజాగా ఉన్నప్పటికీ కొన్ని సమస్యలొస్తాయి. వాటిని దూరం చేసుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో చర్మాన్ని కాపాడుకోవాలంటే ఎలాంటి టిప్స్ పాటించాలో తెలుసుకోండి.

ఎందుకు పొడిబారుతుంది.. చలికాలంలో చర్మ సమస్యలు రావడం చాలా కామన్. చల్లని గాలుల కారణంగా చర్మం నుండి తేమ ఆవిరైపోతుంది. దీంతో స్కిన్ డ్రైగా మారుతుంది. బయట వచ్చే చల్లని ఉష్ణోగ్రతల కారణంగా బాడీ లోపల వేడిని స్టోర్ చేసేందుకు ట్రై చేస్తుంది. దీంతో రక్త ప్రసరణ తగ్గుతుంది. చర్మంలో ఆయిల్ స్రావాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల స్కిన్ డ్రైగా మారతుంది. దీనికోసం చర్మం పొడిబారకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి.

ఫేస్ ప్యాక్స్.. ఆయుర్వేద ఫేస్ ప్యాక్స్ సహజ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేసి పొడిబారకుండా చేస్తుంది. ఇది చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. ఆయుర్వేదంలో కొన్ని అత్యుత్తమ ఫేస్‌ప్యాక్స్ ఉన్నాయి. రకరకాల ఫేస్‌ప్యాక్స్‌ని తయారు చేసుకుని వాడొచ్చు.

ఏయే ప్యాక్స్.. ప్యాక్స్‌లో ఎక్కువగా పాలు, బాదం, రోజ్ వాటర్‌తో ప్యాక్ వేసుకోవచ్చు. వీటితో పాటు బొప్పాయి, తేనె, అరటిపండు, కలబంద, పాలు, తేనె, అలోవేరా, మీగడ వీటని ఉపయోగించి ప్యాక్ వేసుకుంటే చాలా వరకూ చర్మంలో తేమ పెరిగి పొడిబారడం తగ్గుతుంది.

ఆయిల్ మసాజ్.. చలికాలంలో చర్మంలో నూనె ఉత్పత్తిని పెంచుతుంది. ఆయిల్ మసాజ్ చాలా మంచిది. అందుకోసం ఏ ఆయిల్స్ వాడాలో తెలుసుకోండి. బాదం నూనె, భృంగరాజ్ ఆయిల్, మంచి నూనె ఇవన్నీ కూడా చర్మానికి మేలు చేస్తాయి..

ఏ నూనె వాడితే ఏ లాభాలు.. వేప నూనె.. ఇది అన్ని చర్మాలకు సూట్ అవుతుంది. వాపు, ఇన్ఫెక్షన్, మొటిమలు, చర్మ అలర్జీలని తగ్గిస్తుంది.

కొబ్బరినూనె : ఇది దద్దుర్లు, ఎరుపెక్కడ, చిన్న ఇన్ఫెక్షన్లని దూరం చేస్తుంది.

బాదం నూనె : మొటిమలని తగ్గించి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది.

షాదావరి : షాదావరి ఆయిల్‌లో యాంటీ ఏజింగ్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది డ్రైనెస్ సమస్యని దూరం చేస్తుంది. చర్మాన్ని దృఢంగా, సాగేలా చేస్తుంది.

భృంగరాజ్ ఆయిల్ .. భృంగరాజ్ ఆయిల్ మొటిమలు, చర్మ సమస్యల్ని తగ్గిస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.

# డయాబెటిస్ ఉందా..?











డయాబెటిస్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానవాళిని పట్టి పీడిస్తున్న అతిపెద్ద ఆరోగ్య సమస్య. మన దేశంలోనూ డయాబెటిస్ కేసులు విస్తృతంగా పెరుగుతున్నాయి. విస్తృతిపై (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్) చేసిన ఓ అధ్యయనం తాజాగా యూకేకు చెందిన మెడికల్ జర్నల్ లాన్‌సెట్‌లో ప్రచురితమైంది. ఆ అధ్యయనం ప్రకారం ప్రస్తుతం మన దేశంలో మధుమేహుల సంఖ్య 10 కోట్ల మార్కును దాటింది. మధుమేహం సైలెంట్ కిల్లర్. దీర్ఘకాలం పాటు బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో లేకపోతే.. కిడ్నీ, నరాల సమస్యలు, హైపర్‌టెన్షన్, గుండె సమస్యల ముప్పు పెరుగుతుంది. చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిళ్లు కారణంగా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. అంతేకాగు, జన్యుపరమైన కారణాల వల్ల కూడా షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మీ కుటుంబంలో ఎవరైనా.. షుగర్ వ్యాధితో బాధపడుతుంటే, మీకు మధుమేహం ముప్పు పొంచిఉన్నట్లే. మీరు షుగర్ వ్యాధి బారిన పడకుండా.. మరింత శ్రద్ధ తీసుకోవాలసిన అవసరం చాలానే ఉంది. పోషకాహార నిపుణురాలు లీమా మహాజన్ మీరు తీసుకోవాలసిన 5 జాగ్రత్తల గురించి ఇన్‌స్టా గ్రామ్ స్టోరీలో వివరించారు.

తగినంత ప్రొటీన్ తీసుకోండి.. ఆరోగ్యంగా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరం. అమైనో ఆమ్లాలతో కూడిన ఇది కణజాలాల తయారీ, మరమ్మతు, దృఢత్వంలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో జరిగే జీవక్రియలన్నీ వీటి రూపంలోనే సాగుతాయి. గ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయటానికి, హార్మోన్ల నియంత్రణకు, కండరాల దృఢత్వానికివి కీలకం. అంతేకాదు, ప్రొటీన్ మన కడుపును నిండుగా ఉంచి, అతిగా తినకుండా నిరోధిస్తుంది. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది. ప్రతిరోజూ మీ శరీర బరువుకు కనీసం 1 గ్రాము ప్రొటీన్ తీసుకోండి.

పిండి పదార్థాలు మనకు శత్రువు కాద కానీ, అతిగా తీసుకోవడం మంచిది కాదు. మీ డైట్‌లో కార్బోహైడ్రేట్లను తక్కువగానే తీసుకోండి. వాటికి బదులుగా, ప్రొటీన్లు, కూరగాయలు, చిక్కుళు ,, ఆరోగ్యకరమైన కొవ్వులు మీ ఆహారంలో తీసుకోండి. ఇవి మీ రక్తప్రవాహంలోకి గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తాయి. మీ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి. యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోండి.. బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచడానికి.. యాపిల్ సైడర్ వెనిగర్ సహాయపడుతుంది. మీ భోజనానికి 30 నిమిషాల ముందు గ్లాస్ వాటర్‌లో ఒక టేబుల్ స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ మిక్స్ చేసి తీసుకోండి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది, భోజనానంతర చక్కెర స్పైక్‌లను మెయింటేన్ చేస్తుంది.

భోజనానికీ.. భోజనానికీ మధ్య గ్యాప్ ఇవ్వండి.. ప్రతి భోజనం మధ్య 4-5 గంటల గ్యాప్ ఇవ్వండి. రాత్రి 7 గంటల ముందే భోజనం పూర్తి చేసేయడానికి ప్రయత్నించండి. అంతేకాదు, నేట్ క్రేవింగ్స్‌ను అదుపులో ఉంచుకోండి. ఈ ఉపవాస కాలంలో మన శరీరం గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ప్రాసెస్ చేస్తుంది, అనవసరమైన బ్లడ్ షుగర్ స్పైక్‌లను నివారిస్తుంది.

రోజూ వ్యాయామం చేయండి.. శారీరకంగా యాక్టివ్‌గా ఉండటానికి ప్రయత్నించండి. 30 ఏళ్ల లోపుంటే పరుగు, జిమ్‌కు వెళ్లవచ్చు..ఆపై వయసు వారు నడక, ఎరోబిక్స్, యోగా లాంటివి చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. రోజులో కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేస్తే మంచిదని నిపుణులు అంటున్నారు.

# ఎటపాకలో కొత్త బస్టాండ్ నిర్మాణం..

అల్లూరి సీతారామరాజు: జిల్లా ఎటపాక మండల వాసులకు ప్రభుత్వం నుంచి శుభవార్త అందింది. ఎటపాక మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని.. మండలం ఏర్పాటైనప్పటి నుంచి స్థానికులు కోరుతున్నారు. అయితే ఇన్నేళ్లుగా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం అమలు చేస్తూ ఉండటంతో స్థానిక మహిళలకు బస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎటపాకలో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్థానిక అధికారులకు ఆదేశాలు రాజీ చేసింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటిపోయినా.. కనీస సౌకర్యాలు ఎరుగని గ్రామాలు ఎన్నో. అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన ఊర్లు ఎన్నో.. ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా వాటి ఫలితాలు అందని లబ్ధిదారుల ఎంతో మంది ఉంటారు. మరీ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి తమ ప్రాంతంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలంటూ ఎటపాక స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. సుమారుగా దశాబ్దకాలంగా



ఈ డిమాండ్ ఉంది. అయితే ఎట్టకేలకు వారికి ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది.

ఈ ప్రాంతంలోని విలీన మండలాల వాసులు నిత్యం తెలంగాణలోని భద్రాచలానికి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. విద్య, వైద్యం సహా ఇతరత్రా పనుల కోసం భద్రాచలం వెళ్లి వస్తుంటారు. అయితే ముంపు గ్రామాల బస్సులు కేవలం భద్రాచలం వరకే రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఎటపాక మండలంలోని ఐదు పంచాయతీలకు వెళ్లాలంటే తెలంగాణ మీదుగానే రాకపోకలు సాగించాలి. ఈ నేపథ్యంలో ఎట పాకలో బస్టాండ్ నిర్మించాలని కొన్నేళ్లుగా ఇక్కడి ప్రజలు కోరు తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి బస్టాండ్ ఏర్పాటు కోసం గ్రీన్ సిగ్నల్ రావటంతో.. విలీన మండలాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత భద్రాచలం గ్రామీణ ప్రాంతాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లో కలిపారు. దీంతో విలీన గ్రామాలతో ఎటపాక మండలం ఏర్పాటు చేశారు. ఇక విలీన మండలాల ప్రజల ఇబ్బంది, విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని చింతూరులో బస్టాండ్ నిర్మించారు. ప్రస్తుతం గోకవరం డిపో నుంచి భద్రాచలం వరకు బస్సులు నడుస్తున్నాయి. అయితే ఎటపాక మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలంటూ ఎటపాక ప్రజలు గతంలో పలుమార్లు ప్రభుత్వ అధికారులు వినతులు అందించారు. అయితే ప్రయోజనం లేకుండా పోయింది.

అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. స్త్రీశక్తి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నారు. అయితే ఎటపాక మండలంలో బస్టాండు లేకపోవటంతో స్థానిక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఎటపాకలో బస్టాండు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్టీసీ రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ ఇతర అధికారులు ఇటీవల ఎటపాకలో బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. దీంతో ఈ ప్రాంతవాసుల పదేళ్ల ఎదురుచూపులకు తెరపడినట్లైంది.

# ఉచిత బస్సు పథకం ఉన్నా లేనట్లేనా...



ఏపీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం ఆ జిల్లా మహిళలకు అమలు కావడం లేదు అంటున్నారు. ఈ పథకం వల్ల తాము నష్టపోతున్నాము అంటున్నారట. ఉమ్మడి అనంతపురం జిల్లా (అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు) కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఇక్కడి నుంచి ఏపీఎస్ఆర్టీసీకి చెందిన చాలా బస్సులు కర్ణాటకకు వెళ్తాయి. ఈ బస్సుల్లో ప్రయాణం ఉచితం కాదు.. దీంతో సరిహద్దు గ్రామాల మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 84 బస్సులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాయట.. ఈ బస్సులు బెంగళూరు, బళ్లారి, పావగడ, చెళ్లికెర ప్రాంతాలకు వెళ్తాయి. ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదు. అంతర్రాష్ట్ర సర్వీసులకు పథకం వర్తించదు అని చెబుతున్నారు. దీంతో ఏపీలోని సరిహద్దు గ్రామాలకు వెళ్లాలనుకునే మహిళలు నష్టపోతున్నారు. పెనుకొండ, ఉరవకొండ, కళ్యాణ దుర్గం, రాయదుర్గం, మడకశిర, రామగిరి ప్రాంతాలలోని గ్రామాల మహిళలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. తమకు అంతర్రాష్ట్ర బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తమకు గ్రామాలకు వెళ్లడానికి అంతర్రాష్ట్ర బస్సులే ఆధారం అంటున్నారు.

ఉరవకొండ డిపోలో స్త్రీశక్తి పథకం కింద 44 బస్సులు ఉన్నాయి. ఇక్కడి నుంచి కర్ణాటకలోని బళ్లారికి ఒక పల్లెవెలుగు బస్సు నడుస్తోంది. ఇది ఉరవకొండ, విడపనకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని 16 గ్రామాలను కలుపుతుంది. అయితే, దీనిని అంతర్రాష్ట్ర సర్వీసు పేరుతో పథకాన్ని అమలు చేయడం లేదు అంటున్నారు. ఈ బస్సు గుంతకల్లు కూడా వెళుతుందట. అనంతపురం, ఉరవకొండ మార్గంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు బళ్లారి వరకు వెళ్తున్నాయి. కానీ ఈ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు కావడం లేదు. దీనివల్ల మహిళలు నష్టపోతున్నారు. కళ్యాణదుర్గం నుండి పావగడ, చెళ్లికెర, బళ్లారి, పరుశురాంపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో కూడా ఈ పథకం అమల్లో లేదు. చాలా మందికి దీని గురించి తెలియక ఇబ్బంది పడుతున్నారు. హిందూపురం నుండి బెంగళూరు, పావగడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఏపీ సరిహద్దు గ్రామాల వరకు ఉచిత పథకం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఉచిత పథకం వల్ల సరిహద్దు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది అంటున్నారు.

పెనుకొండ నుండి రొద్దం వెళ్లడానికి సరైన బస్సులు లేకపోవడంతో మహిళలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. వీరు మాత్రమే కాదు ఏపీలో విలీన మండలాల మహిళలు కూడా అంతర్రాష్ట్ర బస్సుల సమస్యను ఎదుర్కొన్నారు. అయితే అధికారులు వెంటనే స్పందించి ఏపీ సరిహద్దు గ్రామాల వరకు అంతర్రాష్ట్ర బస్సుల్లో ప్రయాణానికి అనుమతిస్తున్నారు. తమకు కూడా అలాగే అమలు చేయమని ఉమ్మడి అనంతపురం జిల్లా మహిళలు కోరుతున్నారు.

# నా హత్యకు కుట్ర చేశారు..



నెల్లూరు: జిల్లా కావలి టీడీపీ ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి క్వారీ వద్ద డ్రోన్ కలకలం సృష్టించింది. అన్నవరంలో కొందరు వ్యక్తులు డ్రోన్‌తో సంచరిస్తూ, మారణాయుధంతో పట్టుబడ్డారు. తనను హత్య చేసేందుకు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కుట్ర పన్నారని కృష్ణారెడ్డి ఆరోపించారు. డ్రోన్ ఎగరేసిన వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ప్రతాప్ రెడ్డి పంపినట్లు చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.

నెల్లూరు జిల్లా కావలి టీడీపీ ఎమ్మెల్యే డీవీ (కావ్య) కృష్ణారెడ్డి క్వారీ దగ్గర కొందరు డ్రోన్‌తో సంచరించడం కలకలం రేపింది. జలదంకి మండలం అన్నవరంలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది.. వారి దగ్గర మారణాయుధం కూడా లభ్యమైందని సమాచారం. తనను హత్య చేసేందుకే వారు వచ్చారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎమ్మెల్యేకు చెందిన క్వారీ దగ్గర కొందరు డ్రోన్‌తో వీడియో తీస్తుండగా సిబ్బంది వారిని పట్టుకున్నారు. అనంతరం వారిని జలదంకి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ఇస్సారపు వేణు, డ్రోన్ ఆపరేటర్ గోళ్ల వినోద్ ఉన్నారు. ఆత్మకూరు రాజేశ్, దామెర్ల శ్రావణ్ అనే ఇద్దరు యువకులు పరారయ్యారు. తనపై హత మార్చేందుకు వారు వచ్చారన్నారు కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి . వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాలతో ఇదంతా చేశారని.. తనను చంపేందుకు రెక్కీ నిర్వహించారని ఆరోపించారు. వాస్తవానికి తాను మంగళవారం మామిడి తోటకు వెళతానని తెలుసని.. కానీ తాను చివరి నిమిషంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు మంగళగిరి వెళ్లానన్నారు. తాను మామిడితోట, క్రషర్‌లో డ్రోన్‌లతో వెతికారని చెప్పుకొచ్చారు. తమ అనుచరులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తే.. వారిపైనా దాడి చేశారన్నారు. డ్రోన్ ఎగరేసినవారిని పట్టుకుని అడిగితే వారు ప్రతాప్ కుమార్ రెడ్డి పంపినట్లు చెప్పారన్నారు.

తన యజమాని, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని చంపడానికి కొందరు వ్యక్తులు వచ్చారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రోన్‌తో క్రషర్ చిత్రీకరణ కోసం వచ్చిన వ్యక్తులు తనను పొడవడానికి ప్రయత్నించారని ఏడుకొండలు ఆరోపించారు. మరొక వ్యక్తి రాయితో దాడి చేయడంతో కాలికి గాయమైందని తెలిపారు. తమ సిబ్బంది రావడంతో నిందితులు డ్రోన్ కెమెరా, కత్తి వదిలి పారిపోయారన్నారు. వారు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కుట్రకు సంబంధించిన ఆధారాలను, అనుమానితుల పేర్లను పోలీసులకు అందజేశామని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సీఎంను కలిసి కుట్రదారుల వివరాలు అందజేస్తానన్నారు.

# ఉచిత బస్సు కోసం వాల్‌పేపర్ మార్చేస్తున్నారు..



ఏపీ: ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాలు ప్రారంభించడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొందరు మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించుకునే విధానం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాలను ఆగస్టు 15న ప్రారంభించింది. రాష్ట్రంలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆసక్తికనబరుస్తున్నారు. రోజుకు 15లక్షల నుంచి 18 లక్షల వరకు మహిళలు ప్రయాణాలు చేస్తుంటే.. ఈ సంఖ్య రోజుకు 26 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది ఆర్టీసీ. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు సంగతి పక్కన పెడితే.. సోషల్ మీడియాలోనూ రీల్స్‌తో కొత్త ట్రెండ్‌ను తీసుకొచ్చారు. ఈ వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

ఓ మహిళ ఉచిత బస్సుపై ఓ రీల్ చేశారు. ఆమె తన మొబైల్‌కు వాల్‌పేపర్‌గా తన ఆధార్ కార్డును పెట్టేసుకుందట.. ఎందుకా అంటూ మరో మహిళ ఆరా తీశారు. ఉచిత బస్సు పథకంలో భాగంగా బస్సు ఎక్కిన ప్రతిసారి పర్సు, బ్యాగ్‌లో నుంచి ఆధార్ కార్డు బయటకు తీసి చూపించడం కష్టంగా ఉందని.. అందుకే ఆధార్ కార్డును ఇలా వాల్ పేపర్‌గా పెట్టుకున్నట్లు ఆమె చెప్పారు. అప్పుడు కండక్టర్‌కు ఆధార్ ఈజీగా చూపించి ఉచిత బస్సులో ప్రయాణం చేయొచ్చని చెప్పుకొచ్చారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఇదేం వాడకం తల్లోయ్ అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఐడియా ఏదో బావుందే అంటూ మరికొందరు స్పందించారు.

అనంతపురం జిల్లాలో మరో యువతి చేసిన రీల్ వైరల్‌అవుతోంది. 'అమ్మకు ఇష్టమైన కట్లపొడి, ఆకులు తీసుకొచ్చేందుకు ఫ్రీగా తాడిపత్రి నుంచి అనంతపురానికి వెళ్తున్నా' అంటూ బస్సు ముందు రీల్ చేశారు. ఈ వీడియో కూడా వైరల్ కాగా.. ఉచిత బస్సు పథకాన్ని అవసరాల కోసం ఉపయోగించుకోవాలని నెటిజన్లు సూచిస్తున్నారు. ఫ్రీగా ఉంది కదా అని ఇలా చేయడం సరికాదంటున్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతను ప్రపంచానికి తెలియజేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి చ%ఖీ=జుజుఎబయఱఅఎెమోవశ్రీటఱవ% అని ట్యాగ్ చేయమని మహిళలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తోందని ఆయన అన్నారు. ఇది మహిళలకు స్వాతంత్ర్యం, సమానత్వం కల్పించే అవకాశం అని తెలిపారు. మహిళలు సురక్షితంగా, గౌరవంగా ప్రయాణించాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు.

ఏపీ మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద 'పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్' బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నారు. మొదట ఘాట్ రోడ్లు, తిరుమలకు వెళ్లే బస్సులు, అంతర్రాష్ట్ర బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదన్నారు.. కానీ ఆ తర్వాత స్థానిక పరిస్థితుల్ని బట్టి కొన్ని సడలింపులు ఇచ్చారు. అంతేకాదు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ, సాఫ్ట్ కాపీ చూపించినా ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించాలని ఆదేశించారు.

# స్కాన్ చేస్తే ఉచితంగా వినాయకుడి విగ్రహం..

శ్రీకాకుళం: జిల్లాలో వినాయక చవితి సందడి నెలకొంది. ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇంటికే వినాయకుడి విగ్రహం డోర్ డెలివరీ చేస్తారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను వాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగను జరుపుకోబోతున్నాం.. అయితే వారం ముందు నుంచే సందడి కనిపిస్తోంది. ఏపీలో జనాలు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే శ్రీకాకుళం జిల్లా లో ప్రజలకు బంపరా ఫర్ ఇచ్చారు.. జస్ట్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు ఇంటి వినాయకుడి విగ్రహాన్ని డోర్ డెలివరీ చేస్తారు. పర్యావరణానికి మేలు చేసేలా గణేష్ చతుర్థి జరుపుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజిద్దామన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఒక పోస్టర్‌ను కలెక్టర్ దినకర్ విడుదల చేశారు. మట్టి విగ్రహాలను పూజించడం మంచిదని.. అప్పుడు విగ్రహాలను నిమజ్జనం చేసినా నదులు కలుషితం కాకుండా కాపాడవచ్చన్నారు. ప్రకృతిని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నా రు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఇంటికే మట్టి విగ్రహాలు వస్తాయని.. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు రూపొందించాము అన్నారు. అలాగే ఈ నెల 26న సూర్యమహల్ జంక్షన్ దగ్గర ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేస్తామని.. అక్కడ మట్టి వినాయక విగ్రహాలను పంచుతామని ప్రకటించారు.

మరోవైపు ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 78 వినతులను స్వీకరించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సమస్యల తక్షణ పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించ డానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.. జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు చేశారు.. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది.

# ఉపాధి హామీ కూలీలు.. చేయాల్సిందే..



ఏపీ: దొంగ మస్టర్లను అరికట్టేందుకు సరికొత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇకపై ఫోటోల తనిఖీలు మరింత కఠినతరం కానున్నాయి. తప్పుడు ఫోటోలు అప్‌లోడ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు. ముఖ ఆధారిత హాజరు విధానం రానుండటంతో మోసాలకు చెక్ పడనుంది. ఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉంది కదూ! ఉపాధి హామీ పథకంలో శ్రామికుల హాజరును యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీని ద్వారా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని భావిస్తున్నారు. అందుకే యాప్ ద్వారా ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని తేలింది. కొందరు తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. వేరే పనుల ఫొటోలు పెడుతున్నారు. హాజరు తక్కువగా ఉన్నా ఎక్కువ చూపిస్తున్నారు. పురుషుల బదులు మహిళల ఫొటోలు పెడుతున్నారు. ఒకే వ్యక్తి ఫొటోను వేర్వేరు చోట్ల వాడుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం వేర్వేరు వ్యక్తుల ఫొటోలు పెడుతు న్నారు. కొందరు మధ్యాహ్నం ఫొటోలే పెట్టడం లేదు.. ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

# కొత్త నేషనల్ హైవే.. ఈ రూట్‌లో ఆరు లైన్లుగా



విజయవాడ: విజయవాడ నుంచి కడప మీదుగా బెంగళూరుకు కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి 544జీ పనులు కొనసాగుతున్నాయి. ఈ రహదారి పూర్తయితే విజయవాడ–బెంగళూరు మధ్య దూరం దాదాపు 100 కిలోమీటర్లు తగ్గుతుంది.. ప్రయాణ సమయం కూడా 3 గంటలు ఆదా అవుతుంది. వాహనాలు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ఆరు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. ఈ హైవే అనంతపురం జిల్లాలోని కొడికొండ నుంచి ప్రారంభమై.. ప్రకాశం జిల్లా మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం దగ్గర నేషనల్ హైవే 16లో కలిసేలా ప్లాన్ చేశారు. కొన్ని చోట్ల రహదారి పనులు పూర్తి అయ్యాయి.. మిగిలిన చోట్ల వేగంగా జరుగుతున్నాయి. అండర్‌పాస్‌లు, వంతెనలు కూడా స్పీడ్‌గా కడుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే విజయవాడ నుంచి బెంగళూరుకు ప్రయాణం సులువు అవుతుందని భావిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతాలు, మెట్రో నగరాలను కలపడమే దీని లక్ష్యం. ఈ రహదారి 2026 జూన్ చివరి నాటికి పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ద్వారా విజయవాడ, బెంగళూరు మధ్య ప్రయాణ సమయం తగ్గుతడంతో పాటుగా పారిశ్రామికవాడలు, పెద్ద నగరాలను కలుపుతుంది. ఈ హైవేలో కేవలం 13 చోట్ల మాత్రమే ప్రవేశించేందుకు వీలుంది. విజయవాడ–బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూ సేకరణ చేయగా.. ఈ హైవే నిర్మాణం చేస్తున్న జిల్లాల్లో చాలా మంది రైతులకు ఇంకా పరిహారం అందలేదు అంటున్నారు. కడప జిల్లా చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లె, శ్రీరాములపేట, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో రైతులు పనులు ఆపారు. తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు మాత్రం తమకు త్వరగా పరిహారం అందాలని కోరుతున్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో కూడా పలువురు రైతులకు పరిహారం అందలేదంటున్నారు.. ఇటీవల పనుల్ని అడ్డుకున్నారట.

# కేంద్రం మరో తీపికబురు.. అనుకున్నది సాధించారుగా!

ఏపీ: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటన విజయవంతమైంది. కేంద్ర మంత్రులను కలిసి విద్యా రంగానికి నిధులు కోరగా, కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు మంజూరు చేసింది. సమగ్ర శిక్షణ కోసం గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్లు కేటాయించబడ్డాయి. సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల అభివృద్ధికి రూ.167.46 కోట్లు విడుదలయ్యాయి. డైట్ కళాశాలల అభివృద్ధికి కూడా నిధులు మంజూరయ్యాయి. ఆదివాసీ విద్యార్థుల వసతి గృహాల కోసం ప్రత్యేకంగా రూ.11 కోట్లు విడుదల చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనుకున్నది సాధించారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లి చొరవ తీసుకుని మరీ కేంద్రమంత్రుల్ని కలిసి నిధులు కోరారు. అయితే లోకేష్ ప్రయత్నాలు ఫలించాయి.. ఏపీకి కేంద్రం తీపికబురు చెప్పింది.. భారీగా నిధులు మంజూరు చేసింది. కేంద్రం విద్యా రంగానికి భారీగా నిధులు విడుదల చేసింది.. ఈ విద్యా సంవత్సరానికి కేంద్రం నుంచి రాష్ట్ర విద్యాశాఖకు నిధులు మంజూరయ్యాయి. సమగ్ర శిక్షణ కోసం గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను మంజూరయ్యాయి. మంత్రి లోకేష్ చొరవతో కేంద్రం రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెబుతున్నారు.

కేంద్రం ముఖ్యంగా సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల అభివృద్ధికి రూ.167.46 కోట్లు కేటాయించింది. ఐసీటీ ల్యాబ్స్, స్మార్ట్ తరగతులు, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు కోసం ఈ నిధులు ఉపయోగపడతాయి.. పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్స్ అంటే కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు. స్మార్ట్ తరగతుల ద్వారా డిజిటల్ బోధన అందుబాటులోకి వస్తుంది. సైన్స్ ల్యాబ్‌లతో విద్యార్థులు ప్రయోగాలు చేయవచ్చు. డైట్ కళాశాలలను అభివృద్ధి చేయడానికి కూడా రూ.43.23 కోట్లు మంజూరు చేసింది. డైట్ కళాశాలలు సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారడానికి ఈ నిధులు ఉపయోగపడతాయి. గతంలో ఈ కాలేజీలకు 50 శాతం నిధులే వచ్చేవి.. కానీ ఈసారి 96 శాతం నిధులు వచ్చాయి. వీటితో పాటుగా ఆదివాసీ విద్యార్థుల వసతి గృహాల కోసం రూ.11 కోట్లు విడుదల చేసింది. ఆదివాసీ విద్యార్థులకు వసతి



గృహాలు మెరుగు పరచడానికి ఈ నిధులు ఉపయోగపడతాయి.

పలు శాఖలకు సంబంధించి పలువురు కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి నిధులు కేటాయించలని కోరారు. 'న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యాను. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదారంగా ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపాను. రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతిని వివరించాను. ఏపీలో కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాల్సిందిగా ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ గారికి విజ్ఞప్తిచేశాను' అంటూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు. మంత్రి నారా లోకేష్, టీడీపీ ఎంపీలతో కలిసి ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌ను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు టీడీపీ తరపున శు భాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు గవర్నర్ గా పనిచేసిన అనుభవం రాబోయే రోజుల్లో దేశానికి సమర్థవంతమైన సేవలు అందించ డానికి ఉపకరిస్తుందని లోకేష్ వ్యాఖ్యానించారు. మొత్తం మీద మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటనతో అనుకున్నది సాధించారు.. కేంద్రానికి చెప్పి ఏపీకి నిధులు మంజూరు చేయించారు.



# ఆ రెండు సినిమాల పైనే ఆశలు!

తెలుగు సినీ పరిశ్రమలో మెగా ఫ్యామిలీకి ఉండే క్రేజే వేరు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చిన మెగాస్టార్‌గా ఎదిగిన చిరంజీవి మెగా ఫ్యామిలీ అంటే ఓ బ్రాండ్‌గా మార్చేశారు. ఆయన తర్వాత పవన్ కళ్యాణ్ , రామ్‌చరణ్, వరుణ్ తేజ్, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్.. ఇలా ఫ్యామిలీలో అందరూ హీరోలే. మెగా ఫ్యామిలీ నుంచి సినిమా వస్తుందంటే ఇండస్ట్రీలో సందడి వాతావరణం నెలకొంటుంది. అయితే ఇటీవల కాలంలో వీరి సినిమాలు బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ప్రభావం చూపించలేకపోతు న్నాయి. ఎంతలా అంటే మెగా ఫ్యామిలీలో అల్లు అర్జున్('పుష్ప 2'తో బ్లాక్‌బస్టర్) మినహా మరే హీరో రెండేళ్లుగా హిట్టు కొట్టలేదు. వీరి నుంచి ఈ మధ్యకాలంలో వచ్చిన 8 సినిమాలు ఫ్లాప్ కావడంతో ఏకంగా రూ.400 కోట్లకు పైగా నష్టాలు వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. మెహర్ రమేష్ దర్శకత్వంలో చిరంజీవి, తమన్నా జంటగా, కీర్తిసురేష్ కీలకపాత్రలో నటించిన 'భోళా శంకర్'తో చిరంజీవి ఫ్లాఫ్ ఎదురైంది. 2023లో వచ్చిన ఈ మూవీ చిరంజీవి కెరీర్‌కు మచ్చ తెచ్చే రేంజ్‌లో ప్రేక్షకులు తిరస్కరిం చారు. ఈ సినిమా వల్ల రూ.50 కోట్ల వరకు నష్టం వచ్చినట్లు సమాచారం. ఆ దెబ్బతో చిరంజీవి తన ఫ్యూచర్ ప్రాజెక్టులపై స్పెషల్ ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. అందుకే ఆ తర్వాత ఆయన్నుం చి మరో సినిమా రాలేదు. ఈ ఏడాది 'విశ్వం భర'తో, వచ్చే సంక్రాంతికి అనిల్ రావిపూడితో తీస్తోన్న సినిమాతో గట్టి హిట్లు కొట్టాలని ధ్యేయంగా పెట్టుకున్నారు.

ఇక పవన్ కళ్యాణ్ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదు. సముద్ర ఖని దర్శకత్వం లో సాయిధర మ్ తేజ్‌తో కలిసి పవన్ కళ్యాణ్ నటించిన 'బ్రో' మూవీ అందరినీ నిరాశపరిచింది. ఈ చిత్రం ద్వారా రూ.40కోట్ల నష్టాలు వచ్చినట్లు టాక్. ఇక ఈ ఏడాది ఆయన్నుం చి వచ్చిన 'హరిహర వీరమల్లు' చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. తొలిరోజు టాక బాగానే ఉన్నా నాసిరకం వీఎఫ్ఎక్స్ పరమచెత్తగా ఉన్నాయని ప్రేక్షకులు పెదవి విరిచారు. దీనికితోడు ఓ వర్గం నెగిటివ్ టాక్ స్ప్రెడ్ చేయడం మైనస్‌గా మారింది. దీంతో వారం రోజులకే థియేటర్ల నుంచి వెళ్లిపోయి పవన్ కళ్యాణ్‌కి భారీ ఫ్లాప్‌ని మిగిల్చింది. ఈ చిత్రం ద్వారా సుమారు రూ.85 కోట్ల వరకు నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఆశలన్నీ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఓజీ'పైనే ఉన్నాయి. ఈ మూవీ సెప్టెంబర్ 25న దసరా కానుకగా విడుదల కానుంది.



# టీజర్ అదిరింది




తెలుగులో టాలెంటెడ్ యాక్టర్లలో ఒకరిగా ముద్ర వేసుకున్న నటుల్లో సత్యదేవ్ ఒకరు. చదువుకునే రోజుల్లోనే సినిమాల మీద ప్యాషన్‌తో షార్ట్ ఫిల్మ్ మేకర్‌గా మారిన సత్యదేవ్.. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే సినీ ఇండస్ట్రీలో అవకాశాల కోసం కాళ్లరిగేలా తిరిగాడు. 'మిస్టర్ పర్‌ఫెక్ట్'తో క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినీ ప్రయాణం మొదలుపెట్టి హీరోగా, విలన్‌గా మాత్రమే కాకుండా సపోర్టింగ్ రోల్స్ చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నాడు. అయితే సత్యదేవ్ టాలెంట్‌కి తగ్గిన బొమ్మ ఇప్పటివరకు పడలేదనే చెప్పాలి. కొన్ని సినిమాల్లో అతడికి మంచి పేరొచ్చినా ఆ దర్శకులు సత్యదేవ్‌ని సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. మంచి పాత్ర పడాలే గానీ వెండితెరపై చెలరేగిపోతాడు. అలాంటి సత్యదేవ్ తాజాగా 'రావు బహదూర్'గా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య వంటి చిత్రాలతో మంచి గుర్తింపు సాధించిన వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ నటిస్తోన్న సినిమాయే 'రావు బహదూర్'. వీళ్లిదరి కాంబినేషన్లో ఇది రెండో చిత్రం. దీనికి సంబంధించి మేకర్స్ ఇటీవలే సత్యదేవ్ లుక్‌తో టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని రిలీజ్ చేస్తూ 'అనుమానం పెనుభూతం' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ మూవీని సూపర్ స్టార్ మహేశ్ బాబు నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్ టైన్‌మెంట్ సమర్పిస్తుండగా శ్రీ చక్రాస్ ఎంటర్ టైన్‌మెంట్స్, అప్లాజ్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ని దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సోమవారం విడుదల చేశారు. 'నాకు అనుమానం అనే భూతం పట్టింది' అంటూ ఆసక్తికరమై డైలాగ్‌తో టీజర్ స్టార్ట్ అవుతోంది. అక్కడి నుంచి పలు విభిన్న గెటప్పుల్లో సత్యదేవ్ ఇరగదీశాడు. అసలు ఈ కథ ఆయన కోసమే పుట్టిందా అనిపించేలా ఉంది. ప్రతి గెటప్‌కి కరెక్ట్‌గా సూటయ్యాడు. టీజర్ చూస్తుంటే దీన్ని సైకలాజికల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు అనిపిస్తోంది. ఈ టీజర్‌ని రిలీజ్ చేసిన రాజమౌళి 'రావు బహదూర్' టీమ్‌కి విషెస్ చెబుతూ ట్వీట్ చేశారు. 'సత్యదేవ్ ఎప్పటిక్కపుడు ఎదుగుతూ అద్భుతమైన పాత్రలు పోషించడం చూస్తుంటే ఆనందంగా ఉంది. 'రావు బహదూర్' సినిమా కోసం ఆయనతో పాటు డైరెక్టర్ వెంకటేష్ మహాకు నా శుభాకాంక్షలు. ఈ సినిమా చూడటానికి ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. జక్కన్న ట్వీట్‌కు స్పందించిన సత్యదేవ్... రాజమౌళి గారికి కృతజ్ఞతలు. తెలుగు సినిమా ఎంత దూరం వెళ్లగలదో మీరు చూపించారు.

# ఇండియా పరేడ్‌లో జంట



అమెరికా న్యూయార్క్‌లో జరిగిన 79వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇండియా డే పరేడ్‌లో కాంగ్రెస్ సభ్యుడు థానేదార్, మేయర్ ఎరిక్ ఆడమ్స్, ఎంపీ సత్నామ్ సింగ్‌తో పాటు ఈ జంట హాజరైంది. రియల్ లైఫ్ కపుల్‌లా కనిపించిన వీరి ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు మాత్రం "ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు?", "ఇలా ఫోటోలతోనే సరిపెట్టేస్తారా?" అంటూ కామెంట్లు చేస్తున్నారు. విజయ్–రష్మిక జంట తమ సంబంధాన్ని ఎప్పుడు అధికారికంగా ప్రకటిస్తుందో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది.

టాలీవుడ్‌లో విజయ్ దేవరకొండ , రష్మిక మందానా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట కొన్నాళ్లుగా రిలేషన్‌లో ఉన్న సంగతి అందరికీ తెలిసినా వాళ్లు మాత్రం అఫిషియల్‌గా చెప్పరు. జిమ్‌లో కలిసి వర్కౌట్లు చేస్తారు, రెస్టారెంట్లకి, వెకేషన్స్‌కి కలిసే వెళ్తారు. రష్మిక పండగ సమయాల్లో విజయ్ దేవరకొండ ఇంట్లో ప్రత్యక్షమవుతుంటుంది. ఇంత జరుగుతున్నావాళ్ల మధ్య సంబంధం గురించి మాత్రం చెప్పరు. ఇటీవల విజయ్ దేవరకొండ నటించిన 'కింగ్‌డమ్' రిలీజ్ కాగా 'మనం హిట్టు కొట్టినం' అంటూ రష్మిక కంగ్రాట్స్ కూడా చెప్పింది. అయితే తమ మధ్య బంధం గురించి అఫిషియల్‌గా చెప్పేస్తే కిక్ ఉండదన్న ఉద్దేశంతోనే వీరు ఫ్యాన్స్‌ని ఊరిస్తూ ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇక అసలు విషయానికొస్తే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అమెరికాలోని న్యూయార్క్ 43వ వార్షిక ఇండియా డే పరేడ్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో భారత కాన్సులేట్ ఏటా ఈ పరేడ్ నిర్వహించింది. 1970లో ప్రారంభమైన ఈ పరేడ్ న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్, మాసాచుసెట్స్, రోడ్ ఐలాండ్, న్యూ హాంప్‌షైర్, వెర్మాంట్ మరియు మైన్ రాష్ట్రాల్లో భారతీయ సముదాయానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. తాజా వేడుకకు వేలాది మంది భారతీయ అమెరికన్లు, విదేశీయులు హాజరయ్యారు. విజయ్ దేవరకొండ, రష్మిక మందానా ఈ కార్యక్రమంలో "గ్రాండ్ మార్షల్స్"గా హాజరై పరేడ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వీరిద్దరు ఇలా కనిపించడం సంతోషంగానే ఉన్నా ఆ గుడ్‌న్యూస్ కూడా చెప్పేస్తే సెలబ్రేషన్స్ చేసుకుంటామని ఫ్యాన్స్ అంటున్నారు. మీ ఇద్దరి మధ్య రిలేషన్ గురించి ఇంకా ఊరించకుండా ఇప్పటికే చెప్పండి అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మరి అభిమానుల కోరిక ఈ జంట ఇప్పటికైనా తమ రిలేషన్ గురించి బయటపెడుతుందా? లేదా? అన్నది చూడాలి.

ఈ వీరి సినిమాల సంగతికొస్తే.. విజయ్ దేవరకొండ ఇటీవల 'కింగ్‌డమ్' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈ చిత్రానికి తొలిరోజు మంచి టాక్ వచ్చినా రెండో రోజు నుంచే డౌన్ అయిపోయింది. ఓవరాల్‌గా చూసుకుంటే నిర్మాత నాగవంశీకి నష్టాలు తెచ్చిపెట్టినట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీని తర్వాత విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన్' అనే సినిమాలో నటించనున్నాడు. అంతేకాకుండా 'టాక్సీవాలా' డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో రష్మికతో విజయ్ రొమాన్స్ చేయనున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తోన్న ఈ మూవీ హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కబోతోందట.

# వాళ్ల సాయంతోనే సొంతంగా సినిమాలు.....



ఆయనెప్పుడూ ప్రజల పక్షమే.. ఆయన సినిమాలెప్పుడూ ప్రజల గొంతుకే. సామాజిక స్పృహను తట్టిలేపే విప్లవగీతం ఆర్ నారాయణ మూర్తి తాజాగా 'యూనివర్సిటీ పేపర్ లీక్' అనే చిత్రాన్ని తీశారు. ఈ సినిమా ఆగస్టు 22న థియేటర్స్‌లో విడుదల కాబోతుంది. అయితే తన సినిమాలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా రిలీజ్ చేసే ఆర్ నారాయణమూర్తి.. ఈసారి కూడా అదే పంథాలో తన సినిమాని రిలీజ్ చేస్తున్నారు.

మీడియా ఇంటర్వ్యూలు, ప్రమోషన్ ఈవెంట్‌లకు దూరంగా ఉండే ఆర్ నారాయణ మూర్తి.. తాజాగా ప్రముఖ యాంకర్ తులసీచంద్‌కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ.. తన సినిమా ప్రస్థానం ఎలా మొదలైందో చెప్పుకొచ్చారు. "నేను యాక్టర్ అవుదాం అని ఇండస్ట్రీకి వచ్చాను. కాని ఎంత ప్రయత్నించినా కాలేకపోతున్నాను. నేను బొమ్మలు కూడా వేసేవాడ్ని. అదే నా సినిమా ప్రస్థానానికి అడుగులు పడేట్టు చేసింది. దాసరి గారి డైరెక్షన్‌లో ఓ సినిమాకి బొమ్మలు వేసే ఆర్టిస్ట్‌గా వెళ్లాను. ఫస్ట్ నాగేశ్వరరావుగారి బొమ్మవేశాను. ఆ సినిమాకి దాసరి గారు డైరెక్టర్. ఆయన ఆ బొమ్మ చూసి మెచ్చుకుని.. ఏ తమ్ముడూ అంటూ భుజంపై చేయి వేశారు.

వేషం కావాలి సార్ అని అడిగాను. ఇప్పుడేం చేస్తున్నావ్ అని అడిగారు. ఇంటర్మీడియేట్ అని చెప్పాను.. నువ్వు డిగ్రీ పూర్తి చేసి రా నీకు వేషం ఇస్తా అన్నారు. నేను డిగ్రీ పూర్తి చేశా.. మద్రాస్ వెళ్లి దాసరిగారిని కలిశా. అన్నట్టుగానే ఆ మహానుభావుడు 'నీడ' సినిమాలో నాకు వేషం ఇచ్చారు. ఆ సినిమా హీరో కృష్ణగారి అబ్బాయి రమేశ్ బాబు. మహేష్ బాబు గారి అన్నగారాయన. ఆయన హీరో.. ఆ తరువాత మెయిన్ రోల్ నాదే. ఆ పాత్రకి మంచి పేరు వచ్చింది.

ఆ తరువాత సంధ్య సినిమాలో నన్నే హీరోగా పెట్టి సినిమా తీశారు మా గురువుగారు. ఆ తరువాత నాకు మంచి మంచి వేషాలు వచ్చాయి. కానీ.. యాక్టర్‌గా బిజీ కాలేకపోయాను. పెద్ద వేషాలు రావడం లేదు.. హీరో వేషాలు రావడం లేదు.. మళ్లీ జూనియర్ వేషాలే వస్తున్నాయి. అక్కడ నుంచి స్ట్రగుల్ స్టార్ట్ అవుతుంది. ఆర్థికంగా బలహీనుడ్ని. ఇటు పెద్ద వేషాలు రావడం లేదు. చాలా స్ట్రగుల్ చేశాను. నేను ఇంకెప్పుడు హీరోని అవుతానని చాలా బాధపడ్డాను. మానసిక వేదన పడ్డా.. అలాంటి దశలో శ్రీశ్రీ గారి పాట గుర్తొచ్చింది. 'కలకానిదీ.. విలువైనదీ.. బతుకూ కన్నీటి ధారలలోనూ బలిచేయకూ.. ఏదీ తనంతట తానే నీ దరికి రాదు.. శోధించి సాధించాలి' అని ఆ మహాకవి శ్రీశ్రీ రాశారు. ఆ పాట నన్ను మార్చేసింది. బాధల్ని మర్చిపోయేట్టు చేసింది. నాకు హీరో వేషాలు ఇవ్వడం లేదు కాబట్టి.. నేనే హీరో అవ్వాలి. హీరో అవ్వాలంటే నేనే సినిమా తీయాలి. నేనే డబ్బులు పెట్టాలి. నా దగ్గరేమో డబ్బుల్లేవ్. ఆ టైమ్‌లో నాకు నా ఫ్రెండ్స్ హెల్ప్ చేశారు. వాళ్ల సాయంతో 'స్నేహచిత్ర పిక్చర్స్' బ్యానర్ స్టార్ట్ చేశాను. ఆ బ్యానర్‌లో నా ఫస్ట్ మూవీ అర్థరాత్రిస్వాతంత్ర్యం అనే సినిమా తీశాను. అక్కడ నుంచి కథ,స్క్రీన్ ప్లే, యాక్షన్, పాటలు, మాటలు, డైరెక్షన్ అన్నీ నేనే చేసుకునేవాడ్ని. అవసరమే అలా చేసేట్టు చేసింది. అలా నా సినిమా ప్రయాణం మొదలైంది.. కొనసాగిస్తూనే ఉన్నాను' అంటూ చెప్పుకొచ్చారు ఆర్ నారాయణ మూర్తి.




# హే భగవాన్.. ఇంతకీ బిజినెస్ ఏంటి?

'కలర్ ఫోటో' సినిమాతో హీరోగా మారిన సుహాస్.. చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. హిట్టు ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 'ఉప్పు కప్పురంబు', 'ఓ భామ అయ్యో రామా' చిత్రాలతో అలరించిన టాలెంటెడ్ యాక్టర్.. 'హే భగవాన్' అనే మరో మూవీని రిలీజ్ కు రెడీ చేస్తున్నారు. సుహాస్ బర్త్ డే సందర్భంగా తాజాగా టైటిల్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఇందులో సుహాస్, శివానీ నగరం జంటగా నటించగా.. భగవాన్ గా వీకే నరేష్ కనిపించారు. హీరో హీరోయిన్లు తమ ఫ్యామిలీ బిజినెస్ విషయంలో ఒకరినొకరు విమర్శించుకుంటున్న ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. గోపీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు.

# కోట శ్రీనివాసరావు సతీమణి కన్నుమూత



ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణించిన నెల రోజుల వ్యవధిలోనే ఆయన కుటుంబంలో మరో విషాదం చోటుచేసుకుంది. కోట శ్రీనివాసరావు భార్య రుక్మిణి సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ లోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుక్మిణి పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈరోజు ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాయి. కోట, రుక్మిణిల మృతితో వారి కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. వయోభారంతో గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడిన ఆయన.. జులై 13న తుదిశ్వాస విడిచారు. అయితే కోట ఇంట మరో విషాదం చోటు చేసుకుంది. ఆయన సతీమణి రుక్మిణి ఈరోజు కన్నుమూశారు. కోట రుక్మిణి సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. ఆమె కొంతకాలంగా అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇవాళ పరిస్థితి విషమించి కన్నుమూశారు. కొద్దిసేపటి క్రితమే రుక్మిణి అంత్యక్రియలు కూడా పూర్తయినట్లు వార్తలు వస్తున్నాయి. కోట శ్రీనివాసరావు మరణించిన నెల రోజుల వ్యవధిలోనే ఆయన భార్య కూడా మృతి చెందడంతో ఫ్యామిలీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,